Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు
# RAJADHANI VARTALU





అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue): 312 పేజీలు (Pages): 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)


బుధవారం, 29 - 7 - 2026

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com NI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

# ఉత్తరాంధ్ర భవితకు గగనద్వారం... భోగాపురం!

## - పెట్టుబడులు...పరిశ్రమలు...పర్యాటకం - ఉపాధికి కొత్త ఊపు! - కలలకు కొత్త రన్‌వే...అభివృద్ధికి గగనమార్గం






**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** ఎయిర్‌పోర్టులు కేవలం విమానాల రాకపోకల కేంద్రాలు కావు. అవి దూరాలను దగ్గర చేసే అద్భుత వారధులు...అవకాశాలను ప్రపంచంతో అనుసంధానించే అభివృద్ధి ద్వారాలు. ప్రతి టేకాఫ్ ఒక కొత్త ఆశయానికి శ్రీకారం చుడితే, ప్రతి ల్యాండింగ్ సొంత నేలను చేరుకున్న ఆనందాన్ని ప్రతిబింబిస్తుంది. ఒక ప్రాంతాన్ని ప్రపంచ పటంలో నిలబెట్టే శక్తి ఉన్న ఈ వైమానిక సౌకర్యం, ఇప్పుడు ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల వాంఛను నెరవేరుస్తూ సాకారమవుతోంది.

**దూరదృష్టి ఫలితం... భోగాపురం!**

భవిష్యత్ అవసరాలను వర్తమానంలోనే గుర్తించి, అభివృద్ధి పథకాలకు రూపకల్పన చేయడం దార్శనిక నాయకత్వానికి నిదర్శనం. అదే దూరదృష్టితో ఉత్తరాంధ్రతో పాటు రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని, దశాబ్దం క్రితమే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ ఆలోచనకు శ్రీకారం చుట్టారు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు. ఆనాడు వేసిన బలమైన పునాదుల ఫలితంగానే, నేడు ఈ బృహత్ ప్రాజెక్టు రూపం దాల్చింది.

విశాఖపట్నానికి సమీపంలోని భోగాపురంలో అద్భుతంగా నిర్మితమైన ఈ గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయం ఆగస్టు 1న భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభం కానుంది. దీంతో ఉత్తరాంధ్ర అభివృద్ధి చరిత్రలో ఒక నూతన అధ్యాయం మొదలు కానుంది.

**భోగాపురం... ఆర్థికాభివృద్ధికి కొత్త ఇంజిన్!**

భోగాపురం విమానాశ్రయం కేవలం ఒక మౌలిక సదుపాయాల ప్రాజెక్టు మాత్రమే కాదు. ఇది ఉత్తరాంధ్ర ఆర్థిక వ్యవస్థకు సరికొత్త ఊపునిచ్చే పవర్‌హౌస్. పెట్టుబడులు, పరిశ్రమలు, ఐటీ, పర్యాటకం, లాజిస్టిక్స్, సేవారంగాల విస్తరణకు ఇది ప్రధాన వేదికగా మారనుంది.

**ఆర్థిక నిపుణుల అంచనా ప్రకారం..**

భోగాపురం-విశాఖపట్నం ప్రాంతం రాబోయే దశాబ్దంలో తూర్పు తీరంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందే అగ్రగామి వాణిజ్య కేంద్రంగా అవతరించనుంది.

**వేల కోట్ల పెట్టుబడుల గమ్యస్థానం:**

ఏరోసిటీ విమానాశ్రయం చుట్టూ అభివృద్ధి చెందనున్న అత్యాధునిక ఏరోసిటీ ఉత్తరాంధ్ర ముఖచిత్రాన్ని పూర్తిగా మార్చి వేయనుంది.

**వ్యాపార, పారిశ్రామిక రంగాలు:**

ఐటీ & ఐటీఈఎస్ పార్కులు, లాజిస్టిక్స్ హబ్స్, కోల్డ్ స్టోరేజీలు, గిడ్డంగులు.

**వసతి & ఆతిథ్యం:**

స్టార్ హోటళ్లు, కార్పొరేట్ ఆసుపత్రులు, కన్వెన్షన్ సెంటర్లు, రిటైల్ హబ్‌లు.

**విద్యా & ఇతర రంగాలు:**

ప్రతిష్టాత్మక విద్యా సంస్థలు, వాణిజ్య సముదాయాలు. ఈ మౌలిక వసతుల కారణంగా రానున్న పదేళ్లలో వేల కోట్ల రూపాయల ప్రైవేటు పెట్టుబడులు ఈ ప్రాంతానికి తరలి వస్తాయని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

**గ్లోబల్ లాజిస్టిక్స్ హబ్‌గా ఉత్తరాంధ్ర**

విశాఖపట్నం, గంగవరం పోర్టులు, జాతీయ రహదారులు, రైల్వే నెట్‌వర్క్‌తో భోగాపురం విమానాశ్రయం అనుసంధానం కావడం వల్ల సముద్ర, రోడ్డు, వైమానిక రవాణా ఒకే వేదికపైకి రానుంది.

**ఎగుమతి కానున్న ప్రధాన వస్తువులు:**

ఫార్మా ఉత్పత్తులు, సముద్ర ఆహారాలు, వ్యవసాయ-ఉద్యాన పంటలు, తాజా పండ్లు, పూలు, హస్తకళలు మరియు ఎలక్ట్రానిక్ వస్తువులు ఇకపై దేశవిదేశాలకు మరింత వేగంగా ఎగుమతి కానున్నాయి.

**పర్యాటక రంగానికి కొత్త రెక్కలు**

భోగాపురం ఎయిర్‌పోర్టు అందుబాటులోకి వస్తే దేశీయ, విదేశీ పర్యాటకుల రాకపోకలు విపరీతంగా పెరుగుతాయి.

**ప్రధాన పర్యాటక ప్రాంతాలు:**

విశాఖ బీచ్‌లు, అరకు లోయ, బొర్రా గుహలు, భీమిలి, యారాడ బీచ్, కైలాసగిరి, తోటలకొండ, బావికొండ, సింహాచలం తదితర ప్రాంతాలకు పర్యాటక తాకిడి మరింత పెరుగుతుంది. దీనివల్ల హోటళ్లు, రిసార్టులు, హోమ్‌స్టేలు, ట్రావెల్ ఏజెన్సీలు, క్యాబ్ సర్వీసులు మరియు స్థానిక కళాకారులకు ఉపాధి అవకాశాలు ఇబ్బడిముబ్బడిగా లభిస్తాయి.

**యువతకు భారీగా ఉపాధి అవకాశాలు**

విమానాశ్రయం నిర్మాణం నుంచి నిర్వహణ వరకు ప్రతి దశలోనూ వేలాది ఉద్యోగాలు సృష్టించబడతాయి.

**ప్రత్యక్ష ఉద్యోగాలు:**

గ్రౌండ్ హ్యాండ్లింగ్, కార్గో సేవలు, భద్రతా విభాగం, ఏవియేషన్ ఇంజినీర్లు, టెక్నీషియన్లు, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ సేవలు.

**పరోక్ష ఉద్యోగాలు:**

ఆతిథ్య రంగం, రవాణా, గిడ్డంగులు, ఈవెంట్ మేనేజ్‌మెంట్ మరియు రిటైల్ రంగాలలో స్థానిక యువతకు బంగారు భవిష్యత్తు లభిస్తుంది.

**భోగాపురం విమానాశ్రయం - ముఖ్యాంశాలు**

మొదటి దశ ప్రయాణికుల సామర్థ్యంఏడాదికి 60 లక్షల మంది. భవిష్యత్ విస్తరణ సామర్థ్యం ఏడాదికి 1.8 కోట్ల మంది వరకు మొత్తం విస్తీర్ణం సుమారు 2,200 ఎకరాలు, మొదటి దశ పెట్టుబడి రూ. 4,500 - 5,000 కోట్లు, ఉత్తరాంధ్రలో తొలి గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయం.

**ఉత్తరాంధ్రకు స్వర్ణయుగం!**

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం కేవలం విమానాల రాకపోకల కేంద్రం కాదు. ఇది ఉత్తరాంధ్రను ప్రపంచంతో అనుసంధానించే గగనద్వారం. పెట్టుబడులకు ఆహ్వానం, పారిశ్రామికీకరణకు పునాది, పర్యాటక రంగానికి కొత్త శక్తి, యువతకు ఉపాధి వేదిక. రాబోయే కాలంలో ఉత్తరాంధ్ర ఆర్థిక రూపురేఖలను సమూలంగా మార్చివేయనున్న ఈ బృహత్ ప్రాజెక్టు...రాష్ట్ర ప్రభుత్వ ఆశయమైన 'స్వర్ణాంధ్ర' నిర్మాణంలో ఒక మైలురాయిగా నిలిచిపోతుందనడంలో ఎలాంటి సందేహం లేదు!

# రాష్ట్రంపై ఎల్‌నినో ప్రభావం, ప్రభుత్వ పరంగా తీసుకోవాల్సిన చర్యలు, రైతుల్లో కల్పించాల్సిన అవగాహనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష



**అమరావతి, (రాజధాని వార్తలు):** జూలై నెలలో 69 శాతం లోటు వర్షపాతం నమోదైనట్లు తెలిపిన అధికారులు. వచ్చే మూడు నెలల్లో సరాసరి 35 నుంచి 40 శాత మేర లోటు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందన్న అధికారులు. జూన్ - నవంబర్ మధ్య 844 మి.మీ వర్షపాతం నమోదుకావాల్సి ఉండగా 551 మి.మీ మాత్రమే నమోదయ్యే అవకాశం ఉందని వివరించిన అధికారులు. అంచనాలకు మించి ఎల్‌నినో ప్రభావం ఉండబోతుందని తెలిపిన అధికారులు. కృష్ణా, గోదావరి బేసిన్లలో ఎగువ రాష్ట్రాల నుంచి జలాలు వచ్చే అవకాశంపై సీఎం ఆరా. అన్ని జిల్లాల్లోనూ ఎల్‌నినో ప్రభావం చూపిస్తోందని, ఎక్కువగా పశ్చిమ గోదావరి, ప్రకాశం, అన్నమయ్య, కృష్ణా, కడప జిల్లాల్లో వర్షాభావ పరిస్థితిలు నెలకొంటాయన్న అధికారులు. 2.78 లక్షల హెక్టార్లలో పత్తి, 1.07 లక్షల హెక్టార్లలో వరిపై ప్రభావం చూపిస్తుందన్న అధికారులు. శ్రీకాకుళం జిల్లా పరిధిలోనే వరి పంటకు ఎక్కువ నష్టం వాటిల్లే అవకాశం ఉందన్న అధికారులు. వంశధార నుంచి జలాలు తరలించి పంటలను కాపాడేలా ప్రయత్నించాలని సూచించిన సీఎం. రాష్ట్రంలో 122 హై రిస్క్ మండలాలను గుర్తించినట్లు తెలిపిన అధికారులు. హై రిస్క్ మండలాల్లో బోరు ఆధారంగా పంటలను కాపాడుకునే అంశాన్ని పరిశీలించాలని సీఎం ఆదేశం. ఆగస్ట్ 3 నుంచి అవగాహన కార్యక్రమాలు, వరికి ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి, అత్యవసర విత్తన ప్రణాళికను రూపొందించినట్లు తెలిపిన అధికారులు. ఫసల్ బీమా యోజన, వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం కింద ఈ నెల 31వ తేదీ వరకు నమోదు ప్రక్రియ కొనసాగుతుందని వివరించిన అధికారులు. వరి పంటకు ఆగస్ట్ 15 వరకు సమయం ఉందన్న అధికారులు. పశు గ్రాసానికి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టినట్లు వివరించిన అధికారులు. 5 నెలలకు సరిపడా 286.30 లక్షల మెట్రిక్ టన్నుల పశుగ్రాసం అందుబాటులో ఉంచామని వివరించిన అధికారులు. సమీక్షకు హాజరైన వ్యవసాయ, ఉద్యాన, హార్టికల్చర్, పశుసంవర్ధక, ఇరిగేషన్ శాఖల అధికారులు, జూమ్ ద్వారా సమీక్షకు హాజరైన మంత్రి అచ్చెన్నాయుడు.

# గాజువాకలో రూ.2000 కోట్ల విలువైన భూమిని జప్తు నుంచి కాపాడేందుకు కృషి చేస్తాం

## - ఉప సభాపతి, అసెంబ్లీ ఫిర్యాదుల కమిటీ చైర్మన్ కె.రఘురామకృష్ణంరాజు



**అమరావతి, (రాజధాని వార్తలు):** విశాఖపట్నం జిల్లా గాజువాక నియోజకవర్గంలో దాదాపు రూ.2000 కోట్లు విలువ చేసే 174.43 ఎకరాల భూమిని బ్యాంకుల జప్తు నుంచి కాపాడేందుకు కృషి చేస్తామని ఉప సభాపతి మరియు అసెంబ్లీ ఫిర్యాదుల కమిటీ చైర్మన్ కె.రఘు రామకృష్ణం రాజు వెల్లడించారు. మంగళవారం అసెంబ్లీ కమిటీ హాల్లో ఆయన అధ్యక్షతన ఫిర్యా దుల కమిటీ సమావేశం జరిగింది. అనంతరం అసెంబ్లీ భవనంలోని ఆయన చాంబరులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఉప సభాపతి రఘురామ కృష్ణంరాజు మాట్లాడుతూ ఏపీ రిఫ్రాక్టరీస్ సంస్థ పరిశ్రమ నెలకొల్పేందుకు 1981లో రాష్ట్ర ప్రభుత్వం 174.43 ఎకరాల భూమిని కేటాయించగా చేయగా ఆ సంస్థ దివాలా తీయడంతో ప్రస్తుతం ఆ భూమి జప్తునకు గురయ్యే ప్రమాదం ఏర్పడిందన్నారు. ఏపి రిఫ్రాక్టరీస్ సంస్థ భూములు మరియు విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ఆర్-కార్డులు (రీహాబిలిటేషన్ కార్డులు) అంశాలపై అసెంబ్లీ కమిటీ హాల్లో జరిగిన ఫిర్యాదుల కమిటీ సమావేశంలో సభ్యులందరితో కలిసి చర్చించామని పేర్కొన్నారు. దీనిపై ఆగస్టు మొదటి వారంలో ఉన్నతాధికారులు, బ్యాంకర్లతో మరోసారి ఫిర్యాదుల కమిటీ సమావేశం నిర్వహించి సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నం చేస్తామన్నారు. ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, కొణతాల రామకృష్ణ, గురజాల జగన్ మోహన్, విష్ణు కుమార్ రాజుతో కలిసి అసెంబ్లీ భవనంలోని ఆయన చాంబరులో మీడియా నిర్వహించారు. ఈ మీడియా సమావేశంలో అసెంబ్లీ ఫిర్యాదుల కమిటీ సభ్యులు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏపీ రిఫ్రాక్టరీస్ సంస్థ దివాలా తీయడంతో జాతీయ రహదారి-16 కి ఆనుకుని ఉన్న విలువైన భూములు కోల్పోయే ప్రమాదం ఏర్పడిందన్నారు. పరిశ్రమల ఏర్పాటు కోసం ఇచ్చిన భూమిని జప్తు చేసుకునేందుకు చేపడుతున్న ప్రక్రియపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నామన్నారు.అదే విధంగా స్టీల్ ప్లాంట్‌కు భూములిచ్చిన వారి పునరావాసం కోసం ఇచ్చిన ఆర్-కార్డులకు సంబంధించి 1203 మందికి రెగ్యులరైజేషన్ పెండింగ్‌లో ఉంచారని వారందరినీ రెగ్యులరైజ్ చేయాలని కోరుతున్నామని శ్రీనివాసరావు చెప్పారు. ఇంకా ఈసమావేశంలో కమిటీ సభ్యులు మరియు శాసన సభ్యులు కొణతాల రామకృష్ణ, గురజాల జగన్ మోహన్, విష్ణు కుమార్ రాజు పాల్గొన్నారు.

# పెనుకొండలో మంత్రి సవిత ప్రజా దర్బార్ - ప్రజల నుంచి అర్జీలు స్వీకరణ

**పెనుకొండ, (రాజధాని వార్తలు):** పెనుకొండ క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖల మంత్రి సవిత ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చి వినతిపత్రాలు అందజేశారు. సొంత ఇల్లు లేక అద్దె ఇళ్లలో నివసిస్తున్న పలువురు కుటుంబాలు తమకు ఇళ్ల స్థలాల పట్టాలు మంజూరు చేయాలని మంత్రిని కోరారు. అలాగే రెవెన్యూ శాఖకు సంబంధించిన భూ వివాదాలు, పట్టాదారు పాస్‌బుక్కులు, ఇతర పరిపాలనా సమస్యలపై కూడా పలువురు అర్జీలు సమర్పించారు.ప్రజల నుంచి అందిన ప్రతి వినతిపత్రాన్ని మంత్రి సవిత స్వయంగా స్వీకరించి, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిశీలించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజల



సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా కృషి చేస్తామని ఆమె పేర్కొన్నారు.

# పముజలకు నివాళులు అర్పించిన బీసీవై పార్టీ అధ్యక్షులు బుధవరపు


**నెల్లూరు, (రాజధాని వార్తలు):** సిపిఐ సీనియర్ నాయకులు మరియు చేనేతలలో అగ్ర నాయకులు యోధుడు అయినా పముజుల దశరధ రామయ్య భౌతిక కాయానికి భారత చైతన్య యువజన పార్టీ జిల్లా అధ్యక్షులు బుధవరపు బాలాజీ మరియు స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ సోమ గోపాల్ సంయుక్తంగా పముజల పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన మంచి సేవా తత్పర్యుడుగా పేరొందిన నేతగా వ్యవహరించడం జరిగిందన్నారు. పార్టీలకు కులాలకు అతీతంగా ప్రజలకు సేవలు చేసి నమ్ముకొన్న సిద్ధాంతాలు ప్రకారం సేవ కుడిగా రాణించిన దసన్నకు జోహార్లు అని బుధవరపు బాలాజీ అన్నారు. 94 ఏళ్ల వయసులో కూడా





ప్రజా సేవ చేస్తున్నారని పలువురు నేతలు పాల్గొన్నారు.

# వైభవంగా భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవం

**- ప్రధాని మోదీకి థింసా, కూచిపూడి నృత్యాలతో ఘన స్వాగతం - ఉత్తరాంధ్రకు గర్వకారణంగా అల్లూరి అంతర్జాతీయ విమానాశ్రయం - ఏఎస్ఆర్ ఎయిర్ పోర్టుపై ప్రతీ ఇంటికీ చేరేలా విస్తృత ప్రచారం - ప్రారంభోత్సవ ఏర్పాట్లపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు**









**అమరావతి, (రాజధాని వార్తలు):** ప్రధాని మోదీ చేతుల మీదుగా జరిగే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఆగస్ట్ 1న ప్రారంభం అవుతున్న అల్లూరి సీతారామరాజు ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు ఉత్తరాంధ్ర ప్రగతిలో కీలక మైలురాయి అవుతుందని ముఖ్యమంత్రి అన్నారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో నిర్మించిన ఈ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ ప్రారంభంతో రాష్ట్ర విమానయాన రంగంలో నూతన శకం ప్రారంభం అవుతుందని సీఎం స్పష్టం చేశారు. ఆధునిక వసతులతో రూపుదిద్దుకున్న ఈ విమానాశ్రయం ఈ ప్రాంతంలో ప్రయాణ సౌకర్యాలతో పాటు ఉపాధి, పర్యాటకం, వాణిజ్య కార్యకలాపాలకు ఊతం ఇస్తుందని స్పష్టం చేశారు. ఉత్తరాంధ్రతో పాటు తెలుగు జాతికి గర్వకారణంగా మారనున్న విమానాశ్రయం ప్రారంభించేందుకు వస్తున్న ప్రధాని నరేంద్ర మోదీకి ఘన స్వాగతం పలికేలా ఏర్పాట్లు చేయాలని సీఎం సూచించారు. ప్రధాని మోదీకి గిరిజన సంప్రదాయ నృత్యం థింసా, కూచిపూడి నృత్యంతో స్వాగతం పలకాలని అధికారులకు సీఎం సూచించారు. గిన్నిస్ రికార్డు సృష్టించేలా ఎక్కువ మందితో థింసా నృత్య ప్రదర్శన ఉండాలని స్పష్టం చేశారు. అలాగే అరకు కాఫీ సహా స్థానిక పర్యాటకానికి బ్రాండింగ్ జరుగుతుందన్నారు.

**ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టుకు విస్తృత ప్రచారం**

ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు థీమ్‌తో విమానాశ్రయం గురించి ప్రతీ ఇంటా చర్చ జరిగేలా విస్తృత ప్రచారం జరగాలని.. మహిళలు, యువత, పాఠశాల విద్యార్థులు ఇలా వివిధ వర్గాలకు చేరువయ్యేలా వేర్వేరు కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అవుట్ రీజ్ కార్యక్రమాలు, క్విజ్, ఉపన్యాస పోటీలు, ఫ్లాష్ మాబ్‌లు, డ్రోన్ షోలను నిర్వహించాలన్నారు. స్థానిక పారిశ్రామిక వేత్తలతోనూ రౌండ్ టేబుల్ కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు థీమ్‌తో 3–5కే రన్ లాంటి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ పోటీల్లో విజయం సాధించిన వారిని కూడా విమానాశ్రయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి వీక్షించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. వివిధ సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం జరిగేలా చూడాలని సూచించారు. మరోవైపు విమానాశ్రయం టెర్మినల్ భవనం ప్రారంభించిన అనంతరం ఇంధన, ఉపరితల రవాణా మంత్రిత్వశాఖలకు చెందిన రూ.18 వేల కోట్ల విలువైన వివిధ ప్రాజెక్టులకు కూడా ప్రధాని మోదీ శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేస్తారని అధికారులు వివరించారు.

**2.30 గంటల పాటు భోగాపురంలో ప్రధాని పర్యటన**

ఆగస్టు 1వ తేదీ ఉదయం 10.45 గంటలకు ప్రత్యేక విమానంలో ఢిల్లీ నుంచి అల్లూరి సీతారామరాజు ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టుకు ప్రధాని మోదీ చేరుకుంటారు. విమానాశ్రయంలో ఆయనకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబులు స్వాగతం పలకనున్నారు. 10.58 గంటలకు విమానాశ్రయ టెర్మినల్ భవనాన్ని ప్రధాని ప్రారంభించనున్నారు. అనంతరం సీఎం, గవర్నర్ తదితరులతో కలిసి ప్రధాని మోదీ టెర్మినల్ భవనాన్ని పరిశీలించనున్నారు. అక్కడి నుంచి బహిరంగ సభా వేదికకు ఓపెన్ టాప్ వాహనంలో ప్రయాణించనున్న ప్రధాని మోదీకి 13,500 మందికి పైగా గిరిజన మహిళలు, విద్యార్థులు సంప్రదాయ గిరిజన థింసా నృత్యంతో ఘన స్వాగతం పలకనున్నారు. 11.30 నుంచి 12.55 గంటల వరకూ బహిరంగ సభలో పాల్గొని, అనంతరం ప్రధాని 1.10 గంటలకు ఢిల్లీకి తిరిగి వెళ్లనున్నారు.

# 'వీబీ జీ రామ్ జీ'తో ఎల్ నినోకు చెక్

**- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత - కరోనా కంటే ప్రమాదకరంగా ఎల్ నినో వర్షాభావ పరిస్థితులు - రాబోయే 4 నెలలు చాలా కీలకం - కరువు తీవ్రతపై గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిచండి - చిరుధాన్యాలు సాగుపై రైతులు దృష్టి సారించాలి - వీబీ జీ రామ్ జీ తో ఉపాధి, మౌలిక సదుపాయల కల్పన - నీరులేని చెరువుల్లో పశుగ్రాసం పెంచుదాం - పొలం కుంటల నిర్మాణానికి 50 శాతం రాయితీ - వివిధ శాఖల సమీక్షా సమావేశంలో మంత్రి సవిత**



**పెనుకొండ/శ్రీసత్యసాయి, (రాజధాని వార్తలు):** కరోనా కంటే ప్రమాదకరమైన ఎల్ నినో వర్షాభావ పరిస్థితులను వీబీ జీ రామ్ జీ పథకంతో ధీటుగా ఎదుర్కొందామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత దిశా నిర్దేశం చేశారు. రాబోయే వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని నీటి ఆధారమైన పంటలకు బదులు చిరుధాన్యాల సాగును రైతులు చేపట్టాలని సూచించారు. జల జీవన్ మిషన్ కింద రూ.11.50 కోట్లు మంజూరయ్యాయని, ఆ నిధులతో తాగునీటి కల్పనకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎల్ నినోను అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు సమన్వయంతో ఎదుర్కోవాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామాల్లో ఎల్ నినోపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. పెనుకొండ ఆర్డీవో కార్యాలయంలో ఎల్ నినో – వర్షాభావ పరిస్థితులు ఎదుర్కోవడంపై వ్యవసాయ, రెవెన్యూ, హార్టికల్చర్, గ్రామీణాభివృద్ధి శాఖాధికారులతో మంత్రి సవిత మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎల్ నినో కారణంగా 140 దేశాల్లో కరవు ప్రబలే ప్రమాదముందని తెలిపారు. భారతదేశం విషయానికొస్తే దక్షి భారతంలో ఎల్ నినో ప్రభావం తీవ్రంగా ఉన్నట్లు అధికారులు హెచ్చరిస్తున్నారు. అందులోనూ ఉమ్మడి అనంతపురంలో కరువు మరింత తీవ్రంగా ఉండే అవకాశముందన్నారు. సాగు, తాగునీటి కష్టాల నుంచి గట్టెక్కేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఫామ్ పాండ్స్ (పొలం కుంటలు) నిర్మాణానికి హార్టికల్చర్ ద్వారా 50 శాతం రాయితీ అందిస్తున్నట్లు మంత్రి సవిత తెలిపారు. ప్రతి వర్షపు నీటితో పాటు వృథాగా పోయే నీటిని ఈ కుంటల్లోకి మళ్లించడం ద్వారా భూగర్భ జలాల మట్టం పెంచడంతో పాటు సాగునీటిని సంరక్షించుకునే అవకాశం కలుగుతుందన్నారు. ఒక్కో ఫాం పాండ్ నిర్మాణానికి రూ. 1.80 లక్షలు వ్యయం కాగా, ప్రభుత్వం రూ.90 వేలు రాయితీ అందిస్తుందని మంత్రి సవిత తెలిపారు.

**చిరు ధాన్యాలు సాగు చేద్దాం**

ఎల్ నినో కారణంగా వర్షాభావ పరిస్థితులు రైతులు గట్టెక్కాల తక్కువ నీటి ఆధారిత పంటలు సాగు చేయాలని మంత్రి సవిత పిలుపునిచ్చారు. ప్రస్తుతం వర్షాలు కురిసినా, రాబోయే నాలుగు నెలలు తీవ్ర ఇబ్బందులు తలెత్తే ప్రమాదముందన్నారు. చిరు ధాన్యాల సాగుకు తక్కువ నీరు అవసరమవుతుందని, ఈ దిశగా రైతులు ఆలోచించాలని సూచించారు. ఎల్ నినోపై గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కరోనా కంటే తీవ్ర నష్టాన్ని ఎల్ నినో కలిగించనున్నట్లు అధికారులు వెల్లడించారు. 140 దేశాల్లో ఎల్ నినో ప్రభావం ఉందని మంత్రి సవిత తెలిపారు.

**చెరువుల్లో పశుగ్రాసం సాగు**

ఎల్ నినో ప్రభావం పశువులపైనా ఉండబోతోందని మంత్రి సవిత తెలిపారు. వర్షాలు కురవక పోవడం వల్ల నీటి ఎద్దడి తలెత్తుతుందన్నారు. పంటలు దెబ్బతినడంతో పశు గ్రాసం కొరత ఏర్పడుతుందన్నారు. ఈ విపత్తు నుంచి పశువులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. నియోజక వర్గం వ్యాప్తంగా ఉన్న చెరువులను గుర్తించి, నీరు లేని చోట పశు గ్రాసం పెంచడానికి చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖాధికారులకు మంత్రి ఆదేశించారు. సాగు చేసిన పశు గ్రాసాన్ని రైతులకు అందజేయాలని స్పష్టంచేశారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ముందు చూపుతో నిర్మించిన నీటి తొట్టెలు ఎంతగానో ఉపయోగపడనున్నాయన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు నీటి తొట్టెలను నింపి, పశువుల దాహాన్ని తీర్చేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సవిత ఆదేశించారు.


**వీబీ జీ రామ్ జీతో కరువుకు చెక్**

జాతీయ ఉపాధి హామీ పథకం స్థానంలో ఏర్పాటు చేసిన వీబీ జీ రామ్ జీ పథకంతో ఎల్ నినో కరువు పరిస్థితులు ధీటుగా ఎదుర్కొందామని మంత్రి సవిత పిలుపునిచ్చారు. వీబీ జీ రామ్ జీ పథకంలో పని దినాలు పెంచారన్నారు. దీనివల్ల వలసలకు అడ్డుకట్ట వేయొచ్చునన్నారు. అదే సమయంలో గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీలు, సాగునీటి కాలువ నిర్మాణాలు కూడా చేపటొచ్చునన్నారు. జల జీవన్ మిషన్ కింద రూ.11.50 కోట్లు మంజూరయ్యాయని, ఆ నిధులతో తాగునీటి కల్పనకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అధికారులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు అందరూ ఐక్యంగా, సమన్వయం చేసుకుంటూ ఎల్ నినో వర్షాభావ పరిస్థితులు ఎదుర్కొందామని మంత్రి సవిత పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఆనందరావు, వ్యవసాయం, రెవెన్యూ, హార్టికల్చర్, గ్రామీణాభివృద్ధి శాఖాధికారులు పాల్గొన్నారు.

# ఇచ్చిన హామీ నెరవేర్చుకున్న ఉపాధ్యాయుడు

## - విద్యార్థిని ఉన్నత చదువులకు చేయూత

**పల్నాడు ప్రతినిధి, (రాజధాని వార్తలు):** పల్నాడు జిల్లా యల్లమంద గ్రామంలోని ఎంపీపీ (ఎస్సీ) పాఠశాలలో ఈ నెల 24వ తేదీన నిర్వహించిన మెగా పీటీఎం సమావేశంలో పాఠశాల పూర్వ విద్యార్థిని పెళ్లూరి యమున పదో తరగతిలో 527 మార్కులు సాధించినప్పటికీ కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా పై చదువును కొనసాగించలేని పరిస్థితి ఉన్నట్లు గుర్తించిన పాఠశాల ఉపాధ్యాయుడు కామినేని పెద్దబ్బాయి ఆ విద్యార్థిని ఇంటర్మీడియట్ విద్య పూర్తయ్యే వరకు అవసరమైన సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ విషయాన్ని జిల్లా విద్యాశాఖ కార్యాలయం దృష్టికి తీసుకెళ్లగా, జిల్లా విద్యాశాఖ అధికారి పి.వి.జే.రామారావు, అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ పి.శ్యాం ప్రసాద్ వెంటనే స్పందించి, విద్యార్థినిని కేజీబీవీ నాదెండ్లలో ఇంటర్మీడియట్‌లో చేర్పించాలని ఆదేశించారు. దీంతో, మంగళవారం ఉపాధ్యాయుడు కామినేని పెద్దబ్బాయి విద్యార్థినికి హాస్టల్‌లో అవసరమైన వస్తువులను సమకూర్చి, ఆమె తల్లిదండ్రులతో



కలిసి కేజీబీవీ నాదెండ్లలో ఇంటర్మీడియట్‌లో విజయవంతంగా చేర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థిని, ఆమె తల్లిదండ్రులు జిల్లా విద్యాశాఖ అధికారి పి.వి.జే.రామారావు, ఏపీసీ పి శ్యాం ప్రసాద్, ఉపాధ్యాయుడు కామినేని పెద్దబ్బాయిలకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల ఉన్నత విద్య కోసం ప్రభుత్వ అధికారులు, ఉపాధ్యాయులు, సమాజం కలిసి చేసిన ఈ చొరవ ఇతరులకు ఆదర్శప్రాయంగా నిలుస్తుందని స్థానిక ప్రజలు, పలువురు గ్రామ పెద్దలు పేర్కొన్నారు.

# ధర్నాల పేరుతో వైకాపా రాజకీయ డ్రామా : గంగిరెడ్డి శ్రీనివాసరెడ్డి

## - వైసీపీ డ్రామాలను యువత నమ్మడం లేదు

**పల్నాడు ప్రతినిధి, (రాజధాని వార్తలు):** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో విద్యా, ఉద్యోగ రంగాల్లో పారదర్శకంగా సంస్కరణలు అమలు చేస్తూ యువత భవిష్యత్తుకు బాటలు వేస్తుంటే, వాటిని చూసి ఓర్వలేక వైఎస్సార్సీపీ నాయకులు ధర్నాలు, నిరసనల పేరుతో రాజకీయ డ్రామాలకు తెరలేపుతున్నారని పల్నాడు జిల్లా టీడీపీ మీడియా కోఆర్డినేటర్ గంగిరెడ్డి శ్రీనివాసరెడ్డి తీవ్రంగా విమర్శించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ, గత ఐదేళ్ల వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో నిరుద్యోగ యువతకు భారీ ఎత్తున హామీలు ఇచ్చి చివరకు మాట తప్పిందన్నారు. ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పి అమలు చేయకపోవడంతో లక్షలాది మంది యువత ఉద్యోగ అవకాశాలను కోల్పోయారని ఆరోపించారు. డీఎస్సీ, ఇతర ప్రభుత్వ నియామకాల విషయంలోనూ స్పష్టమైన కార్యాచరణ లేక వేలాది మంది అభ్యర్థులు తీవ్ర నిరాశకు గురయ్యారని పేర్కొన్నారు. అలాగే ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు పేరుకుపోవడంతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఉన్నత విద్యను కొనసాగించడంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని గంగిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడిన వైఎస్సార్సీపీ నాయకులు ఇప్పుడు విద్యార్థుల సంక్షేమం పేరుతో ధర్నాలు చేయడం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమేనని విమర్శించారు. ప్రజలు గతంలో జరిగిన పరిణామాలను మరిచిపోలేదని, రాజకీయ ప్రయోజనాల కోసం యువతను మరోసారి మోసం చేయాలనే ప్రయత్నాలు ఫలించవని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేసే దిశగా కీలక నిర్ణయాలు తీసుకుంటోందని ఆయన పేర్కొన్నారు. విద్యా ప్రమాణాల పెంపు, పారదర్శక నియామక విధానం, విద్యార్థులకు మెరుగైన అవకాశాలు కల్పించడం, నిరుద్యోగులకు న్యాయం చేయడం లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. అర్హత, ప్రతిభకు ప్రాధాన్యం ఇస్తూ ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని చెప్పారు. యువత ఇప్పుడు రాజకీయ ప్రచారాలను కాకుండా ప్రభుత్వ పనితీరును గమనిస్తోందని గంగిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. గత పాలనలో ఎదురైన చేదు అనుభవాలను



యువత మరచిపోలేదని, అందుకే వైఎస్సార్సీపీ చేపడుతున్న ధర్నాలు, నిరసనలకు ప్రజల్లో స్పందన కనిపించడం లేదని పేర్కొన్నారు. అసత్య ప్రచారాలతో ప్రజలను మభ్యపెట్టే రోజులు ముగిశాయని, అభివృద్ధి, పారదర్శక పాలన, ఉద్యోగాల కల్పనే ప్రజలకు ముఖ్యమని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, విద్యా రంగంలో సంస్కరణలు, యువతకు ఉపాధి అవకాశాల కల్పన వంటి అంశాలపై కూటమి ప్రభుత్వం దృష్టి సారిస్తుంటే, వైఎస్సార్సీపీ మాత్రం వాస్తవ సమస్యలపై చర్చించకుండా రాజకీయ లబ్ధి కోసం నిరాధార ఆరోపణలు చేస్తోందని విమర్శించారు. ప్రజలు ఇప్పటికే ఆ పార్టీ తీరును గమనించారని, అసత్య ప్రచారాలను విశ్వసించే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. చివరగా, ప్రజా సంక్షేమం, అభివృద్ధి, పారదర్శక పాలననే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, విద్యార్థులు, నిరుద్యోగులు, యువత సంక్షేమమే ప్రభుత్వ ప్రాధాన్యమని గంగిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్సీపీ చేపడుతున్న రాజకీయ నిరసనలను యువత పూర్తిగా తిరస్కరిస్తోందని, ప్రజా తీర్పే వారికి తగిన సమాధానం చెబుతుందని ఆయన స్పష్టం చేశారు.

# ఆలయ సేవ చేసే భాగ్యం కలిగింది

## - కోదండరామ స్వామి ఆలయ ట్రస్ట్ బోర్డు ప్రమాణ స్వీకారోత్సవంలో ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి

**కోవూరు, (రాజధాని వార్తలు):** కోవూరులోని సుమారు 400 ఏళ్ల చరిత్ర కలిగిన శ్రీ కోదండరామ స్వామి ఆలయ నూతన ట్రస్టు బోర్డు ప్రమాణ స్వీకారోత్సవం సోమవారంఅత్యంత ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రమాణ స్వీకారం చేసిన నూతన ధర్మకర్తల మండలి ఛైర్మన్ క్రిష్ణా రెడ్డికి, ఇతర బోర్డు సభ్యులు పోరండి నాగలక్ష్మి, యనమల రామచంద్రయ్య, చీకటి లక్ష్మి, అనంతసాగరం రవి, కొప్పోలు ప్రసాద్, కర్రిఆవుల సుధాకర్, నిమ్మల ఆదిలక్ష్మమ్మ, తిరుమంచి కౌశల్యమ్మ, పరంకుశం శ్రీకాంత్‌లకి ఎమ్మెల్యే హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ, ఆలయ నిర్మాణం, పునరుద్ధరణ లేదా ఆలయ సేవ చేసే అవకాశం లభించడం ఎన్నో జన్మల పుణ్యఫలమని అన్నారు. తాను మూడు పర్యాయాలు తిరుమల తిరుపతి దేవస్థానాల (టీటీడీ) ట్రస్టు బోర్డు సభ్యురాలిగా సేవలందించడం తన అదృష్టంగా భావిస్తున్నానని, అన్ని పదవుల కంటే ఆ బాధ్యతనే అత్యున్నతమైనదిగా భావిస్తానని పేర్కొన్నారు. స్వామి వారి ఆశీస్సులు నూతన ట్రస్టు సభ్యులందరిపై ఎల్లప్పుడూ ఉం డాలని ప్రార్థిస్తున్నానని చెప్పారు. ఆలయంలో ఆగమశాస్త్రాలు, సాంప్రదాయ ఆచారాలకు అనుగుణంగా నిత్య పూజలు, ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆలయ పవిత్రతను పరిరక్షిస్తున్న ట్రస్టు సభ్యులను అభినందించారు. రాబోయే రోజుల్లో శ్రీ కోదండరామ స్వామి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసి, ఆలయ వైభవాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు అవసరమైన ప్రతి విషయంలో తన సంపూర్ణ సహకారం అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కోదండరామ స్వామి వారి దివ్య ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక దేవస్థానం పాలక మండలి సభ్యులు. స్థానిక టీడీపీ, నాయకులు కొల్లారెడ్డి సుధాకర్ రెడ్డి, పెన్నా డెల్టా ఛైర్మెన్ గోపిరెడ్డి, బాల రవి, నాటకరాణి వెంకట్. ఇంతా మల్లారెడ్డి, కూటమి నేతలు మహిళలు తదితరులు ఉన్నారు.

# ఘనంగా కోదండరామ స్వామి ఆలయ ట్రస్ట్ బోర్డు ప్రమాణ స్వీకారోత్సవం

## - హాజరైన కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి




**కోవూరు, (రాజధాని వార్తలు):** కోవూరులోని సుమారు 400 ఏళ్ల చరిత్ర కలిగిన శ్రీ కోదండరామ స్వామి ఆలయ నూతన ట్రస్టు బోర్డు ప్రమాణ స్వీకారోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రమాణ స్వీకారం చేసిన నూతన ధర్మకర్తల మండలి ఛైర్మన్ క్రిష్ణా రెడ్డికి, ఇతర బోర్డు సభ్యులు పోరండి నాగలక్ష్మి, యనమల రామచంద్రయ్య, చీకటి లక్ష్మి, అనంతసాగరం రవి, కొప్పోలు ప్రసాద్, కర్రిఅవుల సుధాకర్, నిమ్మల ఆదిలక్ష్మమ్మ, తిరుమంచి కౌశల్యమ్మ, పరంకుశం శ్రీకాంత్‌లకి ఎమ్మెల్యే హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ, ఆలయ నిర్మాణం, పునరుద్ధరణ లేదా ఆలయ సేవ చేసే అవకాశం లభించడం ఎన్నో జన్మల పుణ్యఫలమని అన్నారు. తాను మూడు పర్యాయాలు తిరుమల తిరుపతి దేవస్థానాల (టీటీడీ) ట్రస్టు బోర్డు సభ్యురాలిగా సేవలందించడం తన అదృష్టంగా భావిస్తున్నానని, అన్ని పదవుల కంటే ఆ బాధ్యతనే అత్యున్నతమైనదిగా భావిస్తానని పేర్కొన్నారు. స్వామివారి ఆశీస్సులు నూతన ట్రస్టు సభ్యులందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థిస్తున్నానని చెప్పారు. ఆలయంలో ఆగమశాస్త్రాలు, సాంప్రదాయ ఆచారాలకు అనుగుణంగా నిత్య పూజలు, ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆలయ పవిత్రతను పరిరక్షిస్తున్న ట్రస్టు సభ్యులను అభినందించారు. రాబోయే రోజుల్లో శ్రీ కోదండరామ స్వామి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసి, ఆలయ వైభవాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు అవసరమైన ప్రతి విషయంలో తన సంపూర్ణ సహకారం అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కోదండరామ స్వామి వారి దివ్య ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.

# అబ్దుల్ కలాం జీవితం ఆదర్శం : రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్



**విజయనగరం, (రాజధాని వార్తలు):** మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా పేరొందిన మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజె. అబ్దుల్ కలాం జీవితం ప్రతి భారతీయుడికి ఆదర్శనీయం అని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం అబ్దుల్ కలాం వర్థంతి సందర్భంగా స్థానిక మంత్రి క్యాంప్ కార్యాలయం నందు అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో జన్మించి పేపర్ బాయ్‌గా పనిచేసిన ఒక యువకుడు దేశంలో అత్యున్నతమైన రాష్ట్రపతి పదవి అలంకరించే స్థాయికి ఎదగడం ప్రతి ఒక్కరికి స్ఫూర్తి అన్నారు. తన మేథాశక్తితో అణు పరిక్షల నిర్వహణలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. అలాగే ఇస్రోలో చేరి మొట్టమొదట స్వదేశీ ఉపగ్రహ ప్రయోగ వాహనం ఎస్ఎల్‌వీ 3 తయారీలోనూ పనిచేశారని ప్రశంసించారు. నేటి యువత అబ్దుల్ కలాం గారి జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని మంత్రి పిలుపు ఇచ్చారు. కార్యక్రమంలో కూటమి నాయకులతో పాటు మంత్రి కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# గెలక్సీ లైన్ అధ్యక్షులుగా డాక్టర్ విజయ్







**చీమకుర్తి, (రాజధాని వార్తలు):** లైన్స్ క్లబ్ ఆఫ్ చెమకుర్తి గెలాక్స్ నూతనకార్యవర్గ సభ్యులు ఎన్నిక జరిగింది. స్థానిక జవహర్ మెమొరీయెల్ ఆడిటోరియంలో 2026-27 సంవత్సరంకు నూతన అధ్యక్షులుగా స్థానిక ప్రముఖ విజయ్ డెంటల్ కేర్ అధినేత డాక్టర్ వేల్పుల విజయకుమార్ ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు. లైన్ డిస్టిక్ గవర్నర్ డాక్టర్ జవహర్ ఆధ్వర్యంలో జరిగింది క్లబ్ సభ్యులు ఎంపిక కార్యక్రమంలో భాగంగా పలువురు పేద విద్యార్థులు, బడుగు బలహీన వర్గాలు విద్యార్థులకు కుట్టు మిషన్లు, సైకిల్స్ తదితర పరికరాలను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు డాక్టర్ విజయ్ కుమార్ మాట్లాడుతూ చీమకుర్తిలో తన ఆధ్వర్యంలో నడుస్తున్న డెంటల్ ఆసుపత్రిలో 14లోపు ఉన్న విద్యార్థులకు ఉచితంగా ఒపీ ఇచ్చి చికిత్సలో రాయితీలను ఇవ్వనున్నట్లు చెప్పారు. అదేవిదంగా బదిరిల పాఠశాలను వైద్యం చేయుటకు దత్తత తీసుకొన్నట్లు చెప్పారు.

డాక్టర్ విజయ్ దాత్రుత్వములో కుట్టు మిషనులు, బీసీ హాస్టల్ విద్యార్థులకు చాపలను పంపిణీ చేసారు. నూతన కార్య వర్గములో ఉపాధ్యక్షులుగా ఆలపాటి నరసింహరావు, మాడ పాకుల రాజా, నూనె వంశీ కృష్ణ ఎన్నికయ్యారు. కార్యదర్శిగా బొడ్డు ఆంజనేయులు, సంయుక్త కార్యదర్శిగా లీలారెడ్డి, కోశాధికా రిగా, చలువాది జగదీష్, కో ఆర్డినేటర్‌గా కొండవీటి ఏడుకొం డలు, ప్రోగ్రాం చైర్మెన్‌గా బొడ్డు శ్రీనివాసులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ జవహర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ముఖ్య అతిధిగా డిస్ట్రిక్ట్ గవర్నర్ ఆర్.లక్ష్మి నారాయణ, జిల్లా సర్వీస్ అంబశడర్, బద్రి నారాయణ, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

**కోట, (రాజధాని వార్తలు):** తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రంలో అభివృద్ధి, ప్రజా సంక్షేమం సాధ్యమని కోట క్లస్టర్ ఇన్‌చార్జ్ మద్దాలి సర్వోత్తమరెడ్డి, కో క్లస్టర్ ఇన్‌చార్జ్ తీగల సురేష్ బాబు, మాజీ కోట మండల పరిషత్ అధ్యక్షుడు నల్లపరెడ్డి వినోద్ కుమార్ రెడ్డి, కోట యూనిట్ ఇన్‌చార్జ్ తూపిలి రాధాకృష్ణారెడ్డి పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధినాయకత్వం పిలుపు మేరకు 45 రోజులపాటు నిర్వహించనున్న ఇంటింటికీ తెలుగుదేశం ప్రచార కార్యక్రమాన్ని కోట మండలం 42వ యూనిట్ పరిధిలోని 201వ బూత్‌లో ఉన్న కోట నార్త్ గిరిజన కాలనీలో మండల పార్టీ అధ్యక్షుడు పలగాటి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు ఇంటింటికీ వెళ్లి గత రెండేళ్ల కూటమి ప్రభుత్వ పాలనలో అమలైన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.రాష్ట్ర అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వానికి ప్రజలంతా అండగా నిలవాలని కోరారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేస్తోందని పేర్కొంటూ, వృద్ధులు, వితంతువుల పింఛన్లను రూ.మూడు వేలు నుంచి రూ.నాలుగు వేలకు, వికలాంగుల పింఛన్లను వైకల్య శాతాన్ని బట్టి రూ.ఆరు వేలు నుంచి రూ.పదిహేను వేలు వరకు పెంచి అందజేస్తోందని తెలిపారు. మహిళలకు ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, రైతులకు మూడు విడతల్లో రూ.20 వేల అన్నదాత సుఖీభవ ఆర్థిక సాయం, రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు స్త్రీశక్తి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణం,చేనేత కార్మికులకు నేతన్న భరోసా కింద ఏటా రూ.25 వేల ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు వివరించారు. గత ప్రభుత్వ హయాంలో దెబ్బతిన్న రహదారులను విస్తృతంగా మరమ్మతు చేస్తూనే, రాష్ట్ర వ్యాప్తంగా వేల కిలో మీటర్ల మేర కొత్త సిమెంట్ రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో కొత్త పరిశ్రమలను తీసుకొస్తూ, పెట్టుబడులను ఆకర్షించి పారిశ్రామికవేత్తలకు రాయితీలు కల్పిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమ బాటలో నడి పిస్తున్న ప్రభుత్వం కూటమి ప్రభుత్వమేనని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కోట రెండో ఎంపీటీసీ సభ్యుడు షేక్ మొబీన్ బాషా,జిల్లా టీడీపీ ఎస్సీ సెల్ కార్యదర్శి మర్రి పోలయ్య, మండల పార్టీ ఉపాధ్యక్షులు పాలెపు సుధీర్ కుమార్ రెడ్డి, మర్రి అనీల్, మాజీ సర్పంచులు ఇండ్ల వెంకట రమణమ్మ, బొర్రా పద్మమ్మ, రాయపు పోలయ్య, పురం హరీష్, రాయపు రాకేష్, మీజూరు రవికుమార్‌తో పాటు పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంలో 'రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం'

## - ఇంటింటి ప్రచారంనిర్వహించిన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

## - రూ.5 లక్షల సీసీ రోడ్డు, సరస్వతి దేవి విగ్రహావిష్కరణ





**ఇందుకూరు పేట, (రాజధాని వార్తలు):**కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి అయిన నేపథ్యంలో 'రెండేళ్ల నమ్మకం – అభివృద్ధి, సంక్షేమం' పేరుతో ఇందుకూరుపేట మండలం, కొత్తూరు చింతోపులో కోవూరు శాసన సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి సోమవారం ఇంటింటి ప్రచార కార్యక్రమంను అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్‌రెడ్డి వీధిలో రూ.5 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ సరస్వతి దేవి విగ్రహాన్ని ఆవిష్కరించి, అమ్మవారికిప్రత్యేక పూజలు చేసారు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని మన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయ్యిందని, ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతీ హామీని దాదాపు నెరవేర్చి ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకున్నామని హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ ఫలాలను వివరించేందుకే నేరుగా ప్రజల వద్దకు వస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పినట్లే ప్రతి నెలా 1వ తేదీనే లబ్ధిదారుల ఇంటి వద్దే రూ.4 వేలపెన్షన్ అందజేస్తున్నారని అన్నారు. 'తల్లికి వందనం' కింద బడికి వెళ్లే ప్రతి బిడ్డకు రూ.15 వేలు అందించడమే కాకుండా, ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించి అద్భుతంగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. వీటితో పాటు 'అన్నదాత సుఖీభవ' కింద రైతులకు ఎకరాకు రూ.20 వేలు, 'మత్స్యకార భరోసా' కింద రూ.20 వేలు, 'స్త్రీ శక్తి' ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 'ఆటో సేవ' కింద డ్రైవర్లకు రూ.15 వేల ఆర్థిక సాయం అందించామన్నారు. పేదల ఆకలి తీర్చే అన్నా క్యాంటీన్లను పునఃప్రారంభించడంతో పాటు, ఆక్వా రైతులకు విద్యుత్తు ఛార్జీల భారం పడకుండా చర్యలు తీసుకున్నామని, రైతుల భూ సమస్యలు పరిష్కరించి రాజముద్రతో కొత్త పాసు పుస్తకాలు అందిస్తున్నామని వెల్లడించారు. కోవూరు నియోజకవర్గంలోనూ ప్రభుత్వ సహకారంతో అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గ్రామంలో ఇప్పటికే పూర్తయిన 58 ఇళ్లను త్వరలోనే అర్హులైన పేదలకు అందజేస్తామన్నారు. ఇందుకూరుపేట మండలానికి శాశ్వత లబ్ధి చేకూరేలా ముదువర్తి కాజ్‌వే, మైపాడు-నెల్లూరు రోడ్డు వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు చేపట్టినట్లు గుర్తు చేశారు. అనారోగ్యంతో ఇబ్బందిపడుతున్న పేదలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా అండగా నిలుస్తున్నామని, నియోజకవర్గంలో ఇప్పటివరకు 1,000 మందికి పైగా లబ్ధిదారులకు దాదాపు రూ.10 కోట్ల చెక్కులు అందించినట్లు చెప్పారు. ఒక్క కొత్తూరు చింతోపు గ్రామంలోనే 12 పేద కుటుంబాలకు రూ.10.74 లక్షల ఆర్థిక సాయం అందజేశామని, ఈ రోజు కూడా సాయం కోరిన ఇద్దరిని అర్జీలు, అవసరమైన పత్రాలు తీసుకు రావాలని సూచించినట్లు పేర్కొన్నారు. కష్టాల్లో ఉన్న ప్రతి ఒక్కరినీ ఆదుకునేందుకు ఈ ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ప్రజలు తమ సమస్యలను స్థానిక నాయకుల దృష్టికి గానీ లేదా నేరుగా తన వద్దకు గానీ తీసుకు రావచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖ అధికారులు, జిల్లా వైస్ జడ్పీ చైర్మెన్ శ్రీహరికోట జయలక్ష్మి, మాజీ ఎంపీటీసీ శ్రీహరికోట ప్రసాద్, స్థానిక టీడీపీ నేతలు, దువ్వూరు కళ్యాణ్ రెడ్డి, టీడీపీ నాయకులు, కమలాకర్ రెడ్డి, బెజవాడ వంశీ, వీరేంద్ర నాయుడు. పొన్నెబోయిన చెంచు కిషోర్ యాదవ్, కూటమి నేతలు పాల్గొన్నారు.

# సీపీఐ నేత దశరథ రామయ్య మృతి తీరని లోటు

## - కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి.. అండగా ఉంటామని హామీ : ఎంపీ ప్రభాకర్ రెడ్డి ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** సీపీఐ సీనియర్ నాయకులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షులు పముజుల దశరథ రామయ్య మృతి తీరని లోటు అని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డిలు అన్నారు.జులై 24న నెల్లూరు అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూసిన సంగతి తెలిసిందే. సోమవారం ఆయన స్వగ్రామం సౌత్ మోపూరులోని నివాసంలో భౌతికకాయానికి నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి దంపతులు దశరథ రామయ్య పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ... దశరథ రామయ్య మరణించడం అత్యంత బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. 'దశరథ రామయ్య దాదాపు 19 ఏళ్ల వయస్సులోనే కమ్యూనిస్టు భావజాలానికి ఆకర్షితులై సీపీఐలో చేరారు. 94 ఏళ్ల వయస్సు వచ్చే వరకు నిరంతరం పార్టీ కోసం, ప్రజల కోసం శ్రమించారు. ఎవరికి ఏ సమస్య వచ్చినా నేనున్నాను అంటూ అండగా నిలబడే గొప్ప వ్యక్తిత్వం ఆయనది. తన జీవితంలో ఎన్ని ఇబ్బందులు ఎదురైనా, ప్రజాసేవకే అంకితమంటూ క్షణం తీరిక లేకుండా పనిచేశారు. సీపీఐలో ఎన్నో బాధ్యతాయుతమైన పదవులను చేపట్టి, సుమారు 45 ఏళ్ల పాటు సౌత్ మోపూరు సర్పంచిగా గ్రామానికి అసమాన సేవలు అందించారు.

అటువంటి గొప్ప నాయకుడు ఈ రోజు మన మధ్య లేకపోవడం తీరని లోటు. వారి కుటుంబానికి ఏ ఆపద వచ్చినా తాము ఎల్లప్పుడూ అండగా ఉంటాం' అన్నారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ...సీపీఐ సీనియర్ నాయకులు దశరథ రామయ్య మరణం ఆయన కుటుంబ సభ్యులకు, కమ్యూనిస్టు సోదరులకు తీరని లోటని పేర్కొన్నారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని చెప్పారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, సీపీఐ జాతీయ నాయకులు నారాయణతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు ఉన్నారు.

# పిపిపి విధానం వద్దంటూ ఎమ్మెల్యేకు సామర్లకోట లేఖర్లు వినతి

**సామర్లకోట, (రాజధాని వార్తలు):** రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పీపీపీ విధానం జీవో నెం. 396ను వెంటనే రద్దు చేసి తమ జీవనోపాధి కొనసాగించాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్పకి సామర్లకోట సబ్ రిజిస్టర్ కార్యాలయం పరిధిలో దస్తావేజు లేఖర్లు వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు సోమవారం సామర్లకోట మండలం అచ్చంపేట ఎమ్మెల్యే చినరాజప్పను నివాసంలో కలిసి తమ గోడు వెళ్ళబుచ్చుకున్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ జీవో వల్ల ప్రజలకు ఉప యోగం కంటే ఇబ్బందులే ఎక్కువగా ఉంటాయని వారు పేర్కొన్నారు. గత నాలుగు దశాబ్దాలుగా ప్రజలకు అందుబాటులో ఉన్న రిజిస్ట్రేషన్ సేవలను ప్రైవేట్ వ్యక్తుల ద్వారా నిర్వహించే విధానం సరైంది కాదన్నారు. గ్రామ, వార్డు సచివాలయాలు, టీటీడీ ఈ-సేవ కేంద్రాలు వంటి ప్రభుత్వ వ్యవస్థల ద్వారా ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. ప్రస్తుతం అమలులో ఉన్న విధానంలో ప్రజలకు అనవసర ఆర్థిక భారం పడుతుందని, రూ.2,000 వరకు అదనపు ఖర్చు అయ్యే అవకాశం ఉందని వారు ఆరోపించారు. జీవో 396ను వెంటనే రద్దు చేసి ప్రజలకు అనుకూలమైన విధానాన్ని కొనసాగిం చాలని తమ జీవనోపాధికి సిబ్బంది లేకుండా చూడాలని వారు ఎమ్మెల్యేకు విన్నవించారు. ఎమ్మెల్యేను కలిసి వినతి చేసిన వారిలో దస్తావేజు లేఖరుల సంఘం అధ్యక్షులు మల్యాల సీతాపతిరావు, ప్రతినిధులు గోగు అప్పారావు, షేక్ లాల్, పేకేటి రాజా, రమేష్, ఎస్ వెంకటట్, వి గొల్లబ్బాయి, కోలా నారాయణ రావు (బాబులు), టి సూరిబాబు, ఎన్ రాజశేఖర్, పేకేటి చిరంజీవి, దిట్టకవి వెంకట చలపతి, అప్పారావు ఉన్నారు.


# సంపాదకీయం

## జమ్మూ-కశ్మీర్‌లో వాగ్దాన వంచన

జమ్మూ-కశ్మీర్‌కు రాష్ట్ర హోదా నిరుడు కురిసిన హిమసమూహమేనా? భారత రాజ్యాంగ అధికరణ 370ని రద్దు చేసి, జమ్మూ-కశ్మీర్ రాష్ట్రాన్ని కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చివేసిన చరిత్రకు 5 ఆగస్టు 2026న ఏడు సంవత్సరాలు పూర్తవుతాయి. రానున్న ఈ ఏడవ వార్షికం సందర్భంగా జమ్మూ-కశ్మీర్‌కు రాష్ట్ర ప్రతిపత్తిని పునరుద్ధరించాలన్న డిమాండ్‌ను పునరుద్ఘాటించేందుకు ఆ కేంద్ర పాలిత ప్రాంత అధికార పక్షం నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ) ఈ నెల 20న న్యూఢిల్లీలో ఒక నిరసన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఎన్‌సీకి పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ (కశ్మీర్ లోయలో ప్రభావ ప్రాబల్యాలు ఉన్న పార్టీ) నుంచి తోడ్పాటు లభించలేదు. 'ఇండియా' కూటమి భాగస్వామ్య పక్షాలు ఎన్‌సీ నిరసన పట్ల ఉదాసీనత చూపాయి. అసలు ఈ జూలై 20న న్యూఢిల్లీలో ఆ కార్యక్రమాన్ని నిర్వహించడమే వివేకవంతమైన నిర్ణయం కాదు. ఎందుకంటే అదే రోజున కాక్రోచ్ జనతా పార్టీ పిలుపు మేరకు విద్యార్థులు, యువజనులు ఢిల్లీ వీధులలో పోటెత్తారు. పోలీసులు వారి పట్ల పాశవికంగా ప్రవర్తించారు. ఆ రోజు మీడియా దృష్టి అంతా ఈ నిరసన ప్రదర్శన, పోలీసులు దానిని అణచివేసిన తీరుపైనే కేంద్రీకృతమై ఉన్నది. జూలై 20 నిరసనతో జమ్మూ-కశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరణ మళ్లీ ప్రజల్లో పెద్ద చర్చనీయాంశమవుతుందని నేషనల్ కాన్ఫరెన్స్ ఆశించింది. అయితే ఆ నిరసన ప్రభావ శూన్యంగా మిగిలిపోయింది. అయినప్పటికీ ఆ అపరిష్కృత డిమాండ్ దేశం ముందు ఒక అతి ముఖ్యమైన ప్రశ్నగా ఉన్నది. భారతదేశ చరిత్రలో ఒక రాష్ట్రాన్ని కేంద్ర పాలిత ప్రాంతంగా తగ్గించి వేయడమనేది ప్రప్రథమంగా జమ్మూ-కశ్మీర్ విషయంలోనే జరిగింది. ఆగస్టు 5, 2019న ఇది సంభవించినప్పుడు కశ్మీర్‌కు రాష్ట్ర హోదాను సాధ్యమైనంత త్వరలో పునరుద్ధరిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఆ మాటను అందరూ విశ్వసించారు. అయితే ఏడు సంవత్సరాలు గడిచినా ఆ వాగ్దానం ఒక మాటగా మాత్రమే మిగిలిపోయింది. ఈ దురదృష్టకర పరిణామం ఆ ప్రాంత ప్రజలకే కాకుండా ప్రజాస్వామికవాదులైన సమస్త భారతీయులకూ దిగ్భ్రాంతి, వ్యాకులత కలిగిస్తోందనడంలో సందేహం లేదు. కశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరణ విషయమై కేంద్ర ప్రభుత్వ వాగ్దానాల వివరాలను ఏప్రిల్ 2024లో కశ్మీర్ టైమ్స్ అనే స్వతంత్ర వెబ్‌సైట్ ప్రచురించింది. కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించిన అధికరణ 370ని రద్దు చేసిన రెండు నెలలకు (అక్టోబర్ 2019లో) కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పోలీసు అధికారుల సమావేశంలో మాట్లాడుతూ, 'సాధారణ పరిస్థితులు నెలకొన్న వెంటనే కశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరిస్తామని' చెప్పారు. అదే ఏడాది డిసెంబర్‌లో రామ్ మాధవ్ (ఆనాడు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి) కశ్మీర్‌కు 'త్వరలోనే' రాష్ట్ర హోదా పునరుద్ధరణ అవుతుందని ఉద్ఘాటించారు. ఫిబ్రవరి 2021లో 'కశ్మీర్‌కు తగిన తరుణంలో పూర్తి స్థాయి రాష్ట్ర హోదాను పునరుద్ధరించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చెప్పారు. అక్టోబర్ 2021లో కశ్మీర్‌ను సందర్శించిన అమిత్‌షా 'రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు పూర్తయిన వెంటనే కశ్మీర్‌కు రాష్ట్ర ప్రతిపత్తినిస్తామని ఉద్ఘాటించారు. జనవరి 2022లో అమిత్‌షా ఇలా చెప్పారు: 'నియోజకవర్గాల పునర్విభజన ప్రారంభమయింది. ఆ తరువాత అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయి. కశ్మీర్‌లో పరిస్థితులు యథాస్థితికి వచ్చిన వెంటనే రాష్ట్ర హోదా పునరుద్ధరిస్తామని లోక్‌సభకు హామీ ఇచ్చాను.' పదమూడు నెలల అనంతరం ప్రభుత్వ అనుకూల టీవీ చానెల్ నొకదానికి ఇచ్చిన ఇంటర్వ్యూలోనూ 'అసెంబ్లీ ఎన్నికలు పూర్తయిన వెంటనే కశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరిస్తామని స్పష్టంగా చెప్పాను' అని అమిత్‌షా అన్నారు. 2022లో జమ్మూ-కశ్మీర్‌లో నియోజకవర్గాల పునర్విభజన జరిగింది. జమ్మూ ప్రాంతంలో ఆరు కొత్త నియోజకవర్గాలు ఏర్పడగా కశ్మీర్ లోయలో ఒకటి మాత్రమే అదనంగా ఏర్పడింది. 2024 సెప్టెంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించారు. నాలుగు నెలల ముందే ఉధాంపూర్-దోడాలో ఆ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఎన్నికల అనంతరం కశ్మీర్‌కు రాష్ట్ర ప్రతిపత్తిని పునరుద్ధరిస్తామని చెప్పారు. నియోజకవర్గాల పునర్విభజనతో ప్రత్యర్థి పక్షాల ఓట్లు చీలిపోయి తమకు లబ్ధి చేకూరుతుందని మోదీ, అమిత్‌షాలు విశ్వసించారన్నది స్పష్టం. అయితే వారి విశ్వాసం వమ్మయింది. ఇండియా కూటమి గెలుపును అడ్డుకోవడంలో వారి వ్యూహాలు విఫలమయ్యాయి. మొత్తం 90 నియోజకవర్గాలలో 49 ఇండియా కూటమికి దక్కాయి. వీటిలో 42 నేషనల్ కాన్ఫరెన్స్ గెలిచిన స్థానాలు. ఒమర్ అబ్దుల్లా ముఖ్యమంత్రి అయ్యారు. అసెంబ్లీ ఎన్నికలలో ప్రజల తీర్పును గౌరవించేందుకైనా కశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరణపై చిత్తశుద్ధి చూపారా? లేదు. కశ్మీర్‌కు రాష్ట్ర హోదా తప్పక ఇస్తామని మార్చి 2025లో అమిత్‌షా న్యూఢిల్లీలో అన్నారు. అదే ఏడాది అక్టోబర్‌లో కూడా 'తగిన సమయం'లో కశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరిస్తామని ఆయన చెప్పారు. ఈ హామీలలో ఏ ఒక్కదానినీ నెరవేర్చలేదని మరి చెప్పనవసరం లేదు. ఆ వాగ్దానాలలోని భాషను నిశితంగా పరిశీలించండి. ఉద్దేశపూర్వకంగానే అది అస్పష్టంగా, సందిగ్ధంగా ఉన్నట్టు అర్థమవుతుంది. 'సాధారణ పరిస్థితులు', 'త్వరలో', 'సరైన సమయంలో', 'తగిన తరుణంలో' వీటిల్లో ఏ ఒక్కటైనా ఎట్టకేలకు ఆసన్నమయిందని ఎవరైనా ఎలా నిర్ణయించగలరు? కశ్మీర్‌కు న్యాయబద్ధమైన పూర్తి స్థాయి రాష్ట్ర హోదా పునరుద్ధరణను జాప్యం చేసేందుకే పాలకులు ఇలా మాట్లాడుతున్నారనేది స్పష్టం.

## శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన ఉప్పాలమ్మ తల్లి





**కరప, (రాజధాని వార్తలు):** కాకినాడ రూరల్ మండల కేంద్రం కరప గ్రామ దేవత శ్రీ ఉప్పాలమ్మ తల్లి ఆషాఢ మాసం సందర్భంగా సోమవారం శాకంబరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పచ్చని ఆకుకూరలు, పలు రకాల కాయగూరలు, పండ్లతో అమ్మవారిని అత్యంత వైభవంగా అలంకరించడంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభతో కళకళలాడింది. శాకంబరి అలంకరణను తిలకిం చేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ ప్రత్యేక శాకంబరి అలంకరణకు వైస్ ఎంపీపీ పాట్నీడి సత్యభీమేశ్వరరావు వివిధ రకాల ఆకు కూరలు, కాయగూరలు, పండ్లను సమకూర్చారు. గుమ్మడికాయ, దోసకాయ, బెండకాయ, దొండకాయ, కాకరకాయ, చిక్కుడు, మునగకాయ, సొరకాయ, బీరకాయ, బంగాళదుంప, క్యాప్సికమ్, బీన్స్, క్యారెట్, అరటిపండ్లు తదితర పంటలతో అమ్మవారిని సుందరంగా అలంకరించారు. పుష్పాలు, ఆకుకూరలు, పండ్లతో ఆలయం మొత్తం భక్తిరస వాతావరణాన్ని సంతరించుకుంది. ఆలయ అర్చకుడు విలపర్తి సత్యప్రసాద్ వేద మంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజలు, అర్చనలు, హారతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కరప తహసీల్దార్ ఆకుల సరస్వతి, గ్రామ పెద్దలు, మహిళలు, భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఈ నెల 29వ తేదీ బుధవారం పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి సామూహిక కుంకుమార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే శాకంబరి అలంకరణకు వినియోగించిన కాయగూరలతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి భక్తులకు ప్రసాదంగా అందజేయనున్నట్లు వెల్లడించారు.

## ఘనంగా గురు పౌర్ణమి పూజలు ప్రారంభం



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సామర్లకోట రైల్వే స్టేషన్ సెంటర్ ఆంధ్ర సాయి గీతా సమాజం ఆధ్వర్యంలో శిరిడి సాయిబాబా సన్నిధిలో గురు పౌర్ణమి ఉత్సవాలకు అంకురార్పణ పూజలు చేపట్టారు. చైర్మన్ ధనాల అప్పారావు, అర్చకులు వేణుగోపాలకృష్ణ ఆధ్వర్యంలో, వేద పరిషత్ శిష్య బృందంచే సాయిబాబా విగ్రహానికి క్షీరాభిషేకం, జలాభిషేకం, విభూది పూజ శనివారం నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకు ఈ పూజలు నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ పూజల్లో మాజీ కార్మిక సంఘ నాయకులు దవులూరి సుబ్బారావు, లయన్స్ క్లబ్ అధ్యక్షులు అమలకంటి శ్రీనివాసరావు, ఆంధ్ర సాయి గీతా సమాజం నాయకులు, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

## పండగ వాతావరణంలో "ఇంటింటికి కూటమి ప్రభుత్వం"...!

### - అభివృద్ధి, సంక్షేమం వివరించిన ఎమ్మెల్యే, డీసీసీబీ చైర్మన్‌లు





**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** ఇంటింటికి కూటమి ప్రభుత్వం కార్యక్రమం విజయవంతం చేద్దాం అనే నినాదంతో పెద్దాపురం నియోజకవర్గంలో "ఇంటింటికి కూటమి ప్రభుత్వం" కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా ప్రారంభించారు. పెద్దాపురం మండలం తిరుపతి గ్రామంలో ప్రారంభించిన కార్యక్రమంలో పెద్దాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కాకినాడ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి బాబు పాల్గొని గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శించారు. ఈ సందర్భంగా నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించి, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పథకాలు, పరిపాలనలో తీసుకొచ్చిన పారదర్శకత గురించి వివరించారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం, వ్యవసాయం, మహిళా సాధికారత, యువత ఉపాధి వంటి రంగాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అదేవిధంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులు, పరిపాలనలో చోటుచేసుకున్న లోపాలు, అభివృద్ధి పనులు నిలిచిపోవడం, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై పడిన ప్రభావాన్ని ప్రజలకు వివరించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పారదర్శక పాలన అందించడం, ప్రజల సొమ్మును ప్రజల అభివృద్ధికే వినియోగించడం కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తూ, రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తోందని నాయకులు పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధి, రైతుల సంక్షేమం, మహిళల ఆర్థిక సాధికారత, యువతకు ఉపాధి అవకాశాల కల్పన, మౌలిక సదుపాయాల విస్తరణ వంటి అంశాల్లో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. కరపత్రాలు పంచుతూ, సైకిల్ ర్యాలీ చేపట్టి ఇంటింటా కూటమి ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనగా విశేష స్పందన లభించింది. నాయకులు నేరుగా తమ ఇళ్లకు వచ్చి ప్రభుత్వ కార్యక్రమాలను వివరించడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ, అభివృద్ధి కార్యక్రమాలకు సహకరిస్తామని తెలిపారు. అలాగే ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు ప్రతి అర్హులకూ చేరేలా ప్రజలు భాగస్వాములు కావాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెదేపా ఉపాధ్యక్షులు నిమ్మకాయల రంగనాగ్, కూటమి నాయకులు బడుగు శ్రీకాంత్, కంటే జగదీశ్ మోహన్, బలుసు వాసు, యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్, రాజా సూరిబాబు రాజు, నూనే రామారావు, పోలమర శెట్టి సత్తిబాబు, సరోజ వాసు, స్థానిక ప్రజాప్రతినిధులు, జనసేన, తెలుగుదేశం, బీజేపీ నాయకులు, కూటమి కార్యకర్తలు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## జనసేన నాయకునికి తుమ్మల బాబు పరామర్శ



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సామర్లకోట పట్టణ జనసేన పార్టీ నాయకులు రాజాల శ్రీను ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్న నేపథ్యంలో, వారి నివాసానికి వెళ్లి కాకినాడ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) పరామర్శించారు. ఈ సందర్భంగా శ్రీను ఆరోగ్య పరిస్థితిని ఆయన అడిగి తెలుసుకున్నారు. శ్రీను పూర్తిగా కోలుకుని మళ్లీ ప్రజాసేవలో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. అలాగే ధైర్యంగా ఉండాలని సూచిస్తూ, పార్టీ తరఫున ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా కల్పించి, మనోధైర్యాన్ని నింపారు. జనసేన పార్టీ కుటుంబం ప్రతి కార్యకర్తకు అండగా నిలుస్తుందని, కార్యకర్తల సంక్షేమమే పార్టీకి అత్యంత ప్రాధాన్యమని ఈ సందర్భంగా తుమ్మల రామస్వామి (బాబు) అన్నారు. రాజల శ్రీను త్వరగా కోలుకోవాలని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆకాంక్షించారు.

## రెండేళ్ల ప్రగతి ప్రస్థానం సంతృప్తికరం

### - రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ యం.ఉమేష్ రావు



**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలులో సమతుల్యత సాధిస్తున్న చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ఎన్డీయే కూటమి ప్రభుత్వం యొక్క రెండేళ్ళ ప్రగతి ప్రస్థానం సంతృప్తికరంగా ఉన్నదని రాష్ట్ర ప్రజానీకం సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలుగుదేశం పార్టీ బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ యం.ఉమేష్‌రావు కొనియాడారు. ప్రతీ కుటుంబానికి భరోసా ఇస్తూ, ప్రతీ ప్రాంతానికి అభివృద్ధిని అందిస్తూ రెండేళ్లలో ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకున్న ఎన్డీయే కూటమి ప్రభుత్వం యొక్క రెండేళ్ళ నమ్మకమైన పాలనాకాలంలో సాధించిన ప్రగతిని వివరించే కార్యక్రమంలో భాగంగా బూత్ కన్వీనర్ గాజుల భగత్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ నాయకులు సోమవారం స్థానిక 18వ వార్డు, 52వ బూత్ పరిధిలోని ప్రజల వద్దకు వెళ్ళి కరపత్రాలను అందించి వివరించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతీ హామీని కేవలం రెండేళ్ళ పాలనలో అమలు చేసి చూపించిన ఎన్డీయే కూటమి ప్రభుత్వం, దీపం-2 పథకం ద్వారా ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించిందని కొనియాడారు. వృద్ధాప్యంలో అండగా నిలుస్తున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను అర్హులందరికీ అందిస్తూ ఎన్డీయే కూటమి ప్రభుత్వం సంక్షేమానికి కొత్త అర్థం చెపుతూ, రెండేళ్ల సుపరిపాలనలో ఇప్పటివరకు రూ.66 వేల కోట్లకు పైగా ఖర్చు చేసి.. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగుల జీవితాల్లో కొండంత ఆనందాన్ని నింపుతోందన్నారు. సూపర్ సిక్స్ హామీలో భాగంగా, వరుసగా రెండో ఏడాది తల్లికి వందనం ద్వారా 67,47,190 మంది విద్యార్థులకు లబ్ధి చేకూర్చేలా ఒక తల్లికి ఎంత మంది పిల్లలు ఉన్నా అందరికీ పథకం వర్తింపు చేస్తూ తల్లుల ఖాతాల్లో రూ.10,120.78 కోట్లు ఆర్థిక సహాయం అందించిన సియం చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ఎన్డీయే కూటమి ప్రభుత్వం యొక్క రెండేళ్ళ నమ్మకమైన పాలన పట్ల ప్రజలు సంతృప్తి వ్యక్తీకరిస్తున్నారని తెలిపారు. సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన చంద్రబాబు నాయుడు తొలి సంతకంతోనే మెగా డిఎస్సీని ప్రకటించి 15,941 టీచర్ పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టిన ఎన్డీయే కూటమి ప్రభుత్వం, రెండేళ్ల సుపరి పాలనలో నిరుద్యోగ యువతకు ఇచ్చిన ప్రతీ హామీని నిలబెట్టుకుంటూ, వేలాది మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ ఉపాధి కలలను సాకారం చేసే దిశగా అడుగులు వేస్తున్నదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వన్నెకుల క్షత్రియ సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి, బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు, శ్రీకాళహస్తి పట్టణ ప్రధాన కార్యదర్శి కాసరం రమేష్, సీనియర్ నాయకులు లక్కమనేని మధు బాబు, శ్రీకాళహస్తి పట్టణ కార్యనిర్వాహక కార్యదర్శి వజ్రం కిషోర్, శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు, క్లస్టర్ ఇన్‌ఛార్జి గాదిపాకుల గోపీనాథ్, మాజీ కౌన్సిలర్ షేక్ మహబూబ్ బాషా, నాయీ బ్రాహ్మణ సాధికార సమితి తిరుపతి పార్లమెంటు సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్, తిరుపతి పార్లమెంటు నాయకులు సయ్యద్ చాంద్ బాషా, పూల శేఖర్, నూర్ మొహమ్మద్, బూత్ కన్వీనర్ గాజుల భగత్, గగన్ యాదవ్, శ్రీకాళహస్తి నియోజకవర్గ ఐటిడిపి నాయకుడు ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

### - అర్జున్ అవార్డు గ్రహీత చేతన్ ఆనంద్ పిలుపు




**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం శ్రీ ప్రకాష్ సినర్జీ పాఠశాలలో వివిధ రంగాలలో నైపుణ్యాలను సాధించిన విద్యార్థులను అభినందించు "అభినందన" కార్యక్రమం చాలా ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అర్జున అవార్డు గ్రహీత, జాతీయ బ్యాడ్మింటన్ పోటీల్లో నాలుగు సార్లు విజయం సాధించిన బి చేతన్ ఆనంద్ విచ్చేసి పాల్గొన్నారు. ఆయన విద్యార్థులను, తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులకు చదువు ఒక్కటే ముఖ్యం కాదని వారు అన్ని రంగాలలోను నైపుణ్యాన్ని సాధించాలని, కనీసం ఏదో ఒక క్రీడను అలవాటుగా ఆడాలని, అప్పుడే అన్ని విషయాలలో చురుకుగా వుంటారని పేర్కొంటూ చదువుతో పాటు అన్ని రంగాలలో శిక్షణ ఇస్తున్న శ్రీ ప్రకాష్ సినర్జీ పాఠశాల వంటి పాఠశాలలు నేటి తరానికి చాలా అవసరం అన్నారు. శ్రీ ప్రకాష్ సినర్జీ పాఠశాల డైరెక్టర్ శ్రీ విజయ్ ప్రకాష్ మాట్లుడుతూ విద్యార్థులు ఏ రంగంలో రాణించాలన్నా దానికి ముఖ్య కారకులు తల్లిదండ్రులని, విద్యార్థులందరు తమ తల్లిదండ్రులు సూచించిన మార్గంలో ప్రయాణిస్తూ అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపిక అయిన విద్యార్థులు ముఖ్య అతిథి, విజయ్ ప్రకాష్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు, ఒక యోగి ఆత్మకథ వంటి పుస్తకాలతో వివిధ కథల పుస్తకాలు, అందుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ ప్రకాష్ సినర్జీ పాఠశాల సీనియర్ ప్రిన్సిపాల్ యమ్వివియస్ మూర్తి, ప్రొఫెసర్ సంతానం, పాఠశాల అకడమిక్ కోఆర్డినేటర్ ప్రశాంతి, మీడియా కోఆర్డినేటర్ ఉషా చైతన్య, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అగ్గి రాజేసిన రాశీ ఖన్నా లేటెస్ట్ ఫోటోషూట్



టాలీవుడ్, బాలీవుడ్‌లలో తనదైన నటన – గ్లామర్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కథానాయిక రాశీ ఖన్నా. సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉండే ఈ అందాల భామ... తన లేటెస్ట్ ఫొటోషూట్‌లతో అభిమానులను అలరిస్తుంటుంది. తాజాగా రాశీ తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన బ్లాక్ అండ్ బోల్డ్ లుక్ ఫోటోలు ప్రస్తుతం ఇంటర్నెట్‌ను షేక్ చేస్తున్నాయి. నలుపు రంగు దుస్తుల్లో రాశీ ఖన్నా ఒలికించిన సొగసులు అభిమానులను, నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. ఈ ప్రత్యేకమైన ఫొటోషూట్ కోసం ఈ దిల్లీ బ్యూటీ ధరించిన అవుట్‌ఫిట్... మేకప్ తన అందాన్ని మరింత రెట్టింపు చేశాయి. ఫర్ యువర్ రిఫరెన్స్! అనే క్యాప్షన్‌తో పాటు తన స్టైలిస్ట్ శీఫా జె గిలానీ, మేకప్, హెయిర్ అండ్ ఫొటోగ్రఫీ టీమ్‌కి కృతజ్ఞతలు తెలుపుతూ –టేక్స్ ఏ విలేజ్–అని పోస్ట్ చేశారు. బ్లాక్ డ్రెస్‌లో రాజసం ఉట్టిపడేలా రాశీ ఇచ్చిన ఫోజులు, స్టైలింగ్ న భూతో నభవిష్యతి అన్నట్లుగా ఉన్నాయని అభిమానులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ఈ ఫొటోలు పోస్ట్ చేసిన కొద్ది నిమిషాల్లోనే సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అందాల రాశీఖన్నా అభిమానులు, నెటిజన్లు వేల సంఖ్యలో లైకులు, కామెంట్లతో రీ–పోస్ట్‌లు చేస్తున్నారు. నలుపు రంగు ఇంత అందంగా ఎప్పుడూ లేదు, –బాలీవుడ్, టాలీవుడ్‌లలో ఒక కొత్త సంచలనం, 10 అవుట్ ఆఫ్ 10 అంటూ నెటిజన్లు కామెంట్ల సెక్షన్‌లో హార్ట్, ఫైర్ ఎమోజీలతో రాశీ గ్లామర్‌ను ఆకాశానికెత్తేస్తున్నారు. గత కొన్ని రోజులుగా విభిన్నమైన పాత్రలను ఎంచుకుంటూ తన యాక్టింగ్ స్కిల్స్‌తో మెప్పిస్తున్న రాశీ ఖన్నా, ఇలాంటి ఫ్యాషన్ షూట్స్‌తో తన గ్లామర్ కోణాన్ని కూడా ఆవిష్కరిస్తోంది. ట్రెండ్‌కు తగ్గట్లుగా పర్ఫెక్ట్ ఫ్యాషన్ సెన్స్‌తో కనిపిస్తూ కుర్రకారు హృదయాలను కొల్లగొడుతోంది. ముఖ్యంగా యువతలోఈ బ్యూటీకి ఉన్న క్రేజ్ ఈ ఫొటోలకు వస్తున్న రెస్పాన్స్ చూస్తే స్పష్టంగా అర్థమవుతోంది.

ప్రస్తుతం రాశీ ఖన్నా చేతిలో పలు ఆసక్తికరమైన సినిమాలు, వెబ్ సిరీస్‌లు ఉన్నాయి. ఒకవైపు నటనకు ప్రాధాన్యమున్న పాత్రలు చేస్తూనే, మరోవైపు గ్లామరస్ పాత్రలతో అలరిస్తున్న ఈ భామ మునుముందు మరిన్ని భారీ ప్రాజెక్టులతో ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రస్తుతం తలాఖోన్ మే ఏక్ అనే బాలీవుడ్ చిత్రంలో నటిస్తోంది. విక్రాంత్ మాస్సేతో రాశీకి ఇది రెండో చిత్రం. ఇది ఒక గ్రిప్పింగ్ డ్రామాగా రూపొందుతోంది. ఆర్. మాధవన్, సోహా అలీ ఖాన్‌లతో కలిసి రాశీ నటిస్తున్న సస్పెన్స్ థ్రిల్లర్ బ్రిడ్జ్ యూకే నేపథ్యంలో తెరకెక్కుతోంది. ఈ చిత్రం షూటింగ్ పూర్తయింది. అక్షయ్ కుమార్, విద్యాబాలన్‌లతో కలిసి అనీస్ బజ్మీ రూపొందించనున్న కామెడీ ఎంటర్‌టైనర్‌లోను రాశీ నటించనుంది. షూటింగ్ ఇటీవలే ప్రారంభమైంది. రాజ్ అండ్ డీకే ఫర్జీ 2 వెబ్ సిరీస్‌లోను రాశీ నటించనుంది. ఇక ఈ లేటెస్ట్ ఫొటోషూట్‌తో మరొకసారి సోషల్ మీడియా ట్రెండింగ్‌లో నిలిచింది రాశీ ఖన్నా.

# సెకండ్ ఇన్నింగ్స్ కలిసిరాని హీరోయిన్స్.. మరి కాజల్?





చిత్ర పరిశ్రమలో ఒకప్పుడు స్టార్ హీరోయిన్లుగా ఏలిన భామలు పెళ్లి లేదా లాంగ్ గ్యాప్ తర్వాత సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించడం సహజం. అయితే రీఎంట్రీలో పూర్వ వైభవాన్ని, అనుకున్న స్థాయి విజయాలను అందుకోవడం అందరికీ సాధ్యపడటం లేదు. భూమిక, లైలా, మీరా జాస్మిన్, లయ లాంటి సీనియర్ హీరోయిన్ల జాబితాలోనే ఇప్పుడు చందమామ కాజల్ అగర్వాల్ కూడా చేరిపోయారా? అనే చర్చ టాలీవుడ్‌లో వేడెక్కిస్తోంది..పూర్తి వివరాల్లోకి వెళితే..

**రీఎంట్రీలో తడబడిన స్టార్ హీరోయిన్లు:**

గతంలో స్టార్ హీరోయిన్లుగా వెలిగిన భూమికా చావ్లా పెళ్లి తర్వాత క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా రీఎంట్రీ ఇచ్చినా లీడ్ రోల్స్ దక్కలేదు ఇక మొన్న వచ్చిన యుఫోరియా కూడా ఆశించినంత రిజల్ట్ రాలేదు. లైలా, మీరా జాస్మిన్ లాంగ్ గ్యాప్ తర్వాత తిరిగొచ్చినా ఆశించిన అవకాశాలు రాలేదు. ఇక ఇటీవల లయ రెండు సినిమాలతో ఒకే రోజు వచ్చినా, పెద్దగా గుర్తింపు తెచ్చుకోలేకపోయింది. సెకండ్ ఇన్నింగ్స్ ఈ ముద్దుగుమ్మలందరికీ అనుకున్నంతగా కలిసి రాలేదనే చెప్పాలి.

**కాజల్ ప్రయత్నాలు.. దురదృష్టం:**

పెళ్లి, తర్వాత రీఎంట్రీ ఇచ్చిన కాజల్ అగర్వాల్.. కేవలం కమర్షియల్ పాత్రలకే పరిమితం కాకుండా పర్ఫార్మెన్స్ ఓరియెంటెడ్ పాత్రలను ఎంచుకున్నారు. అయితే దురదృష్టం ఆమెను మొదటి నుంచీ వెంటాడుతోంది. 'ఆచార్య'లో ఆమె నటించిన సీన్లు మొత్తానికే ఎడిటింగ్‌లో ఎగిరిపోగా, 'ఇండియన్ 2' డిజాస్టర్ అవ్వడంతో తదుపరి పార్ట్‌పై ఆశలు అడుగంటిపోయాయి.

**బాక్సాఫీస్ వద్ద దెబ్బకొట్టిన ఫ్లాప్‌లు:**

కాజల్ ప్రధాన పాత్రలో నటించిన 'సత్యభామ' చిత్రం ఆమె క్రేజ్‌ను తిరగరాయలేకపోయింది. ఇక 'కన్నాప్ప' సినిమా కూడా ఆమె కెరీర్‌కు పెద్దగా ఉపయోగపడలేదు. ఇక ఇటీవల వచ్చిన 'ది ఇండియా స్టోరీ'పై కాజల్ కొండంత ఆశలు పెట్టుకుని, మునుపెన్నడూ లేని విధంగా ప్రమోషన్లు చేసినప్పటికీ ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద తీవ్రంగా నిరాశపరిచింది.

**'భగవంత్ కేసరి' ఒక్కటే కాస్త రిలీఫ్:**

రెండో ఇన్నింగ్స్‌లో కాజల్‌కు 'భగవంత్ కేసరి' మినహా మరో చెప్పుకోదగ్గ హిట్ పడలేదు. ఇక ప్రస్తుతం ఆమె ఆశలన్నీ నందమూరి బాలకృష్ణ కాంబినేషన్‌లో రాబోతున్న తదుపరి చిత్రంపైనే ఉన్నాయి.

మరి ఈ సినిమా అయినా ఆమెకు డ్రీమ్ కమ్‌బ్యాక్ సక్సెస్‌ను అందిస్తుందో లేదో చూడాలి. బాలయ్య సినిమాతోనైనా గట్టెక్కేనా?: ఎంతోమంది హీరోయి న్లకు సెకండ్ ఇన్నింగ్స్ సవాళ్లతో కూడుకున్నదిగా మారింది. వరుస ఫ్లాప్‌లు పడుతున్నప్పటికీ కాజల్ ఏమాత్రం తగ్గకుండా వరుస ప్రాజెక్టులు చేస్తూనే ఉన్నారు. ఇక బాలకృష్ణతో చేయబోయే సినిమాతోనైనా కాజల్ మళ్లీ హిట్ ట్రాక్ ఎక్కి, తన సెకండ్ ఇన్నింగ్స్‌ను విజయవంతంగా కొనసాగించాలని అభిమానులు ఆశిస్తున్నారు.

# యాటిట్యూడ్ తప్ప గ్రాటిట్యూడ్ లేదు.. భార్య మీద వెంకీ ఫ్రస్టేషన్




డైరెక్టర్ త్రివిక్రమ్, విక్టరీ వెంకటేష్ కాంబినేషన్లో వస్తున్న 'ఆదర్శ కుటుంబం' సినిమా నుంచి ప్రమోషన్ల జోరు మొదలైంది. నిన్నటి దాకా వెంకీ క్యారెక్టర్ ఇంట్రడక్షన్ వీడియోతో సందడి చేసిన మూవీ టీమ్, లేటెస్ట్‌గా హీరోయిన్‌కు సంబంధించిన మరో వీడియోను రిలీజ్ చేసింది. ఇందులో హీరోయిన్ శ్రీనిధి శెట్టి క్యారెక్టర్‌ను పరిచయం చేస్తూ ఒక ఫన్ అండ్ ఫ్రస్టేషన్ టీజర్ ను కట్ చేసి జనాల ముందుకు తీసుకొచ్చారు. ఈ వీడియోలో భార్యపై విసుక్కునే ఒక భర్తగా వెంకటేష్ కనిపిస్తున్నారు. ఇందులో శ్రీనిధి శెట్టి 'స్వర్ణ' అనే పాత్రలో నటిస్తోంది. ఈ వీడియోలో రఘుబాబుతో కలిసి నడుస్తూ వెంకీ చెప్పిన 'ఈ ఆడవాళ్లకి ఆటిట్యూడ్ తప్ప గ్రాట్యుట్యూడ్ ఉండదు' అనే డైలాగ్ భలేగా ఆకట్టుకుంటోంది. భార్యలు పెళ్లి ఫోటోల అప్పుడు మాత్రమే నవ్వుతారని, ఆ తర్వాత ఎప్పుడూ ముఖం మాడ్చుకునే ఉంటారంటూ వెంకీ చెప్పే డైలాగ్స్ సగటు భర్తలకు ఈజీగా కనెక్ట్ అయ్యేలా ఉన్నాయి. సాధారణంగా ఫ్యామిలీ ఎమోషన్స్, భార్యాభర్తల మధ్య ఉండే సరదా గొడవలను త్రివిక్రమ్ తనదైన తీరులో డీల్ చేస్తుంటారు. ఈ సినిమాలో కూడా వెంకటేష్ కామిక్ టైమింగ్‌ను ఆయన పూర్తిగా వాడుకుంటున్నట్లు ఈ చిన్న గ్లింప్స్ చూస్తే ఇట్టే అర్థమవుతుంది. ఇక శ్రీనిధి శెట్టి విషయానికి వస్తే, ఆమె క్యారెక్టర్ కాస్త డిఫరెంట్‌గా ఉండనునట్లు తెలుస్తోంది. పాన్ ఇండియా లెవల్లో గ్లామరస్ ఇమేజ్ ఉన్న ఆమె, ఇందులో స్వర్ణ అనే ఒక హోమ్లీ రోల్‌లో ఒదిగిపోయినట్లు తెలుస్తోంది. వెంకీ లాంటి సీనియర్ హీరో పక్కన ఆమె పెయిర్ స్క్రీన్ మీద చాలా కొత్తగా సెట్ అయింది. పైగా వీడియోలో ఆమె ఎక్స్ప్రెషన్స్ కు, దానికి కౌంటర్‌గా వెంకీ పడే ఫ్రస్టేషన్ కు మంచి సింక్ కుదిరింది. కేవలం ఈ ఇద్దరే కాకుండా వీడియో చివర్లో సత్య లాంటి కామెడీ ఆర్టిస్టులు కూడా కనిపించడంతో సినిమాలో వినోదానికి ఎలాంటి లోటు ఉండదని మేకర్స్ ముందే హింట్ ఇచ్చేశారు. ఆదర్శ కుటుంబం ఏకే 47 హౌస్ నెం 47 అనే టైటిల్‌కు తగ్గట్టుగానే ఆ ఇంట్లో రోజూ ఒక చిన్నపాటి ఫ్యామిలీ యుద్ధం జరుగుతుందనే ఫీల్ ను ఈ ప్రోమోల ద్వారా జనాల్లోకి తీసుకు రావడంలో టీమ్ సక్సెస్ అయింది. అక్టోబర్ 2న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి తీసుకురాబోతున్నట్లు వీడియో చివర్లో మరోసారి క్లారిటీ ఇచ్చారు. నిన్న రిలీజ్ చేసిన వీడియోతో క్యారెక్టర్ డెప్త్ పరిచయం చేసిన మేకర్స్, ఈరోజు భార్య మీదున్న ఫ్రస్టేషన్‌తో నవ్వించి సినిమా మీద పాజిటివ్ వైబ్స్ క్రియేట్ చేశారు. ఇక థియేటర్లలో ఈ ఆదర్శ కుటుంబం ఏ స్థాయిలో ఆకట్టుకుంటుందో చూడాలి.

# చెన్నై లవ్ స్టోరీ: హీరోయిన్ పేరే ఫస్ట్ వేయడానికి కారణం?



యువ హీరో కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరీ ప్రియ జంటగా నటించిన రొమాంటిక్ లవ్ స్టోరీ 'చెన్నై లవ్ స్టోరీ'. మాస్ మూవీ మేకర్స్, అమృత ప్రొడక్షన్స్ బ్యానర్లపై సాయి రాజేశ్, ఎస్కేఎన్ నిర్మించిన ఈ చిత్రానికి రవి నంబూరి దర్శకత్వం వహించారు. ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద విజయం సాధిస్తున్న ఈ సినిమాపై నిర్మాత సాయి రాజేశ్ ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఈ సినిమాలో హీరోయిన్ ప్రాధాన్యత గురించి కిరణ్ చూపించిన ఉదారత అందరినీ ఆకట్టుకుంటోంది. ఆ వివరాలు చూద్దాం.. బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతున్న చెన్నై లవ్ స్టోరీ: కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరీ ప్రియ కాంబినేషన్‌లో వచ్చిన 'చెన్నై లవ్ స్టోరీ' థియేటర్లలో మంచి టాక్‌తో దూసుకుపోతోంది. సాయి రాజేశ్, ఎస్కేఎన్ నిర్మాతలుగా, ధీరజ్ మొగిలినేని సహ నిర్మాతగా ఈ చిత్రాన్ని రవి నంబూరి చక్కగా తెరకెక్కించారు. క్రిటిక్స్ నుంచి, సాధారణ ప్రేక్షకుల నుంచి ఈ సినిమాకు మంచి ఆదరణ లభిస్తోంది. ఆ సినిమా వద్దని కిరణ్‌కి హెచ్చరికలు: తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో నిర్మాత సాయి రాజేశ్ మాట్లాడుతూ చాలా ఆసక్తికర విషయాన్ని బయటపెట్టారు. "ఈ సినిమా చేయవద్దని కిరణ్‌కు చాలామంది చెప్పారు. ఇది పూర్తిగా అమ్మాయి చుట్టూ తిరిగే కథ, నీ సినిమా కాదు అని హెచ్చరించారు. కానీ కిరణ్ మాత్రం కథను, అందులోని ఆనంద్ క్యారెక్టర్ బలాన్ని నమ్మి సినిమా చేయడానికి ఒప్పుకున్నాడు" అని సాయి రాజేశ్ తెలిపారు. మొదటి పేరు హీరోయిన్‌దే.. ఓకే అన్న హీరో: ఈ సినిమా మొదటి ఫ్రేమ్ నుంచి చివరి వరకు హీరోయిన్ పాత్ర చుట్టూనే తిరుగుతుంది. ఈ క్రమంలో సాయి రాజేశ్ కిరణ్‌తో మాట్లాడుతూ.. "సార్, ఇది అమ్మాయి కథ కాబట్టి పోస్టర్లు, టైటిల్ కార్డులలో మీకంటే ముందు హీరోయిన్ గౌరీ ప్రియ పేరే వేస్తాం. అలా చేస్తే మీకు మరింత గౌరవం వస్తుంది, కథకి న్యాయం జరుగుతుంది" అని చెప్పారట. దానికి కిరణ్ ఏమాత్రం ఆలోచించకుండా వెంటనే ఓకే చెప్పేశారట

**ఇమేజ్ పక్కన పెట్టి కథకే ప్రాధాన్యం:**

'క' సినిమాకి ముందు కిరణ్ అబ్బవరం ఎన్నో కష్టాలు చూశారు. కానీ ఇప్పుడు వరుస విజయాలతో దూసుకుపోతున్నారు. ఇక మాస్ ఎలివేషన్లు, ఇమేజ్‌ల కంటే కథలకే ప్రాధాన్యం ఇస్తూ ముందుకు సాగుతున్నారు. 'చెన్నై లవ్ స్టోరీ'లో తన పాత్ర కంటే హీరోయిన్ క్యారెక్టర్‌కే ఎక్కువ స్కోప్ ఉన్నా, సినిమా బాగుండాలనే ఉద్దేశంతో ఒప్పుకోవడమే ఆయన సక్సెస్‌కు అసలు కారణమని టాలీవుడ్ వర్గాలు అంటున్నాయి. ఒక హీరో అయి ఉండి, తన ఇమేజ్ కంటే సినిమా కథకే ప్రాధాన్యత ఇవ్వడం నిజంగా అభినందనీయం. హీరోయిన్ పాత్రకు పెద్దపీట వేస్తూ కిరణ్ తీసుకున్న ఈ నిర్ణయమే 'చెన్నై లవ్ స్టోరీ' భారీ విజయానికి ప్రధాన కారణమైంది. వరుస విజయాలతో దూసుకుపోతున్న కిరణ్ అబ్బవరం కెరీర్ ఇలాగే దిగ్విజయంగా సాగాలని ఆశిద్దాం.

# లయ కల్పతరువు : మృదంగ మహారాణి డాక్టర్ మండపాక నాగలక్ష్మి

**విజయనగరం, (రాజధాని వార్తలు):** భారతీయ శాస్త్రీయ సంగీత ప్రపంచంలో, ప్రత్యేకించి కర్ణాటక సంగీత రంగంలో వాయిద్య ప్రదర్శనలకు ప్రాణం పోసేది 'లయ'. ఆ లయకు రూపం ఇచ్చి, మృదంగ వాదనలో పురుషాధిక్యత కలిగిన రంగాన్ని సుసంపన్నం చేసి, మహిళా మృదంగ విద్వాంసులలో అగ్రగణ్యురాలిగా విరాజిల్లుతున్న మహోన్నత వ్యక్తిత్వం డాక్టర్ మండపాక నాగలక్ష్మి గారిది. తాజాగా చెన్నైలో సేవా రత్న పురస్కారం స్వీకరించిన నేపథ్యంలో డాక్టర్ మండపాక నాగలక్ష్మి గారిపై ప్రత్యేక కథనం. విశాఖపట్నంలో జన్మించి, లయ సంగీత సేవను తన జీవిత ధ్యేయంగా మలుచుకున్న ఈ మృదంగ మహారాణి, దేశ విదేశాలలో అశేష సంగీత ప్రియులను తన హస్తలాఘవంతో సమ్మోహన పరిచారు. విశాఖపట్నంలో ఎం.విమల మరియు దివంగత ఎం.వి.జె.కె.మూర్తి దంపతులకు 1966 డిసెంబర్ 25న జన్మించిన నాగలక్ష్మి, బాల్యం నుంచే సంగీతం పట్ల అంతులేని అభిరుచిని కనబరిచారు. సంగీత విద్వాంసుల కుటుంబ వాతావరణం ఆమెకు తొలి మెట్టు కాగా, ఆమె పట్టుదల, గురుభక్తి, నిరంతర సాధన ఆమెను నేడు 'మృదంగ మహారాణి' స్థాయికి చేర్చాయి. సంగీత సాధనలో గురువు పాత్ర అనన్య సామాన్యమైనది. డాక్టర్ మండపాక నాగలక్ష్మి మృదంగ వాదనలో అత్యున్నత మెళకువలను అభ్యసించడానికి ప్రముఖ విద్వాంసుల వద్ద కఠోర దీక్ష వహించారు. తొలుత నేమాని సోమయాజులు గారి వద్ద ప్రాథమిక శిక్షణ పొందిన ఆమె, ఆ తర్వాత మరింత ఉన్నతమైన అభ్యసన కోసం ముళ్ళపూడి శ్రీరామమూర్తి గారి వద్ద మరియు ప్రసిద్ధ మృదంగ విద్వాంసులు కారైకుడి ఆర్. మణి (చెన్నై) గారి వద్ద అడ్వాన్స్‌డ్ శిక్షణను పొందారు. ఈ దిగ్గజాల మార్గదర్శకత్వంలో ఆమె మృదంగ వాదనలో సరికొత్త మెరుపులను, లయ విన్యాసాలను సంతరించుకున్నారు. కేవలం వాయిద్యానికే పరిమితం కాకుండా, విద్యాపరంగా కూడా ఆమె



ఉన్నత శిఖరాలను అధిరోహించారు. పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం (తిరుపతి) నుండి సంగీతంలో 'ఎం.ఏ.' (వోకల్) పూర్తి చేశారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం (హైదరాబాద్) మరియు ఆంధ్ర విశ్వవిద్యాలయం (విశాఖపట్నం) నుండి మృదంగం, గాత్రం మరియు లైట్ మ్యూజిక్‌లో అనేక డిప్లొమాలను సాధించి తన విద్యా తపస్సును చాటుకున్నారు. ఆకాశవాణి మరియు దూరదర్శన్‌లలో 'ఏ' గ్రేడ్ ఆర్టిస్ట్‌గా గుర్తింపు పొందిన డా.మండపాక నాగలక్ష్మి, ఇప్పటివరకు దేశ విదేశాలలో 3000లకు పైగా కచేరీలలో మృదంగ సహకారం అందించి అద్భుత రికార్డు సృష్టించారు. నాగలక్ష్మి గారి మృదంగ నాదం కేవలం భారతదేశానికి మాత్రమే పరిమితం కాలేదు. ఆమె నేపాల్, థాయిలాండ్, అమెరికా (వాషింగ్టన్ డి.సి., పిట్స్‌బర్గ్, క్లీవ్‌లాండ్, న్యూయార్క్, న్యూజెర్సీ, బాల్టిమోర్, యంగ్స్‌టౌన్ తదితర నగరాలు) దేశాలలో జరిగిన అనేక ప్రతిష్టాత్మక కచేరీలలో పాల్గొని ప్రశంసలు అందుకున్నారు. భారత ప్రభుత్వ సాంస్కృతిక సంబంధాల మండలి ద్వారా అధికారికంగా ఎంపిక చేయబడిన కళాకారిణిగా దేశం యొక్క కీర్తి ప్రతిష్టలను ప్రపంచ వేదికలపై ఇనుమడింపజేశారు. చెన్నైలోని ది మ్యూజిక్ అకాడమీ, శ్రీ కృష్ణ గానసభ, శ్రీ నారద గానసభ, పార్థసారథి సభ వంటి ప్రఖ్యాత సభలలో అగ్రశ్రేణి గాయకులకు మృదంగ సహకారం అందించారు. సంగీత కాలనిధి డా.మంగళంపల్లి బాలమురళీకృష్ణ, ద్వారం భావనారాయణరావు, బొంబాయి సిస్టర్స్, హైదరాబాద్ సిస్టర్స్, త్రిచూర్ బ్రదర్స్ వంటి ఎందరో మహానుభావుల గాత్ర కచేరీలకు ఆమె మృదంగం మోగించి సభాసదుల నీరాజనాలు అందుకున్నారు. అలాగే ప్రముఖ వయొలిన్, వీణ, ఫ్లూట్ విద్వాంసులతో కలిసి ఆమె చేసిన తాలవాద్య కచేరీలు శ్రోతలను పరవశింపజేశాయి. కళాకారిణిగానే కాకుండా, పరిపాలనా దక్షురాలిగా మరియు అంకితభావం గల ఉపాధ్యాయురాలిగా ఆమె అందించిన సేవలు చిరస్మరణీయమైనవి. విజయనగరంలోని ప్రతిష్టాత్మకమైన 'ఎం.ఆర్. ప్రభుత్వ సంగీత మరియు నృత్య కళాశాల'లో 31 సంవత్సరాల పాటు మృదంగం లెక్చరర్‌గా సేవలు అందించి, వేలాది మంది విద్యార్థులను తీర్చిదిద్దారు. ప్రస్తుతం అదే కళాశాలలో ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ సంగీత విద్యారంగానికి మహోపకారము చేస్తున్నారు. అంతకుముందు రాజమహేంద్రవరంలోని విజయశంకర ప్రభుత్వ సంగీత మరియు నృత్య కళాశాలలో కూడా ప్రిన్సిపాల్‌గా సేవలు అందించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, మరియు ఛత్తీస్‌గఢ్‌లోని ఇందిరా కళా సంగీత విశ్వవిద్యాలయాలకు పేపర్ సెట్టర్‌గా మరియు ఎగ్జామినర్‌గా వ్యవహరిస్తూ విద్యా ప్రమాదాల పరిరక్షణలో తన వంతు పాత్ర పోషిస్తున్నారు. యూట్యూబ్ వేదికగా దాదాపు 400లకు పైగా మృదంగ పాఠాలను అప్‌లోడ్ చేసి, నేటి డిజిటల్ యుగంలో విద్యార్థులకు ఉచితంగా విద్యను చేరువ చేసిన ఘనత ఆమెది. "ఉత్తమ ఉపాధ్యాయురాలు"గా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుండి, మాజీ ముఖ్యమంత్రి మరియు గవర్నర్ల చేతుల మీదుగా అనేక పురస్కారాలను అందుకున్న కళా తపస్విని డా.మండపాక నాగలక్ష్మి డా.మండపాక నాగలక్ష్మి గారి కళా తపస్సుకు నిదర్శనంగా దేశ విదేశాల నుండి అనేక బిరుదులు, గౌరవ డాక్టరేట్లు లభించాయి. జెరూసలేమ్ విశ్వవిద్యాలయం మరియు యు.ఎస్.ఏ.కి చెందిన అకాడమీ ఆఫ్ యూనివర్సల్ గ్లోబల్ పీస్ నుండి ఆమె 'గౌరవ డాక్టరేట్లు' అందుకున్నారు. బొంబాయి సుర్ సింగార్ అకాడమీ వారి నుండి "తలమణి", గుంటూరు వారి నుండి "గాయత్రీ సంగీత విద్వన్మణి", విజయవాడ వారి నుండి "మృదంగ మహారాణి" రాజమహేంద్రవరం వారి నుండి "సంగీత సరస్వతి" మరియు "వాద్య కళావసంతిక", వారణాసిలోని హిందూ బనారస్ విశ్వవిద్యాలయంలో పద్మశ్రీ యెల్ల వెంకటేశ్వరరావు గారి చేతుల మీదుగా "లయ గంగా తరంగిణి" వంటి అత్యున్నత బిరుదులతో సత్కరించబడ్డారు. భారత ప్రభుత్వ సాంస్కృతిక శాఖ మరియు వివిధ అంతర్జాతీయ సంస్థల నుండి 'భారత్ గౌరవ్', 'గ్లోరీ ఆఫ్ ఇండియా', 'ప్రైడ్ ఆఫ్ ఏషియా', 'మహాత్మా గాంధీ ఎక్స్‌లెన్స్ అవార్డు', 'రాష్ట్రీయ పద్మ గౌరవ్ పురస్కార్', 'మహిళా శక్తి శిరోమణి' వంటి ఎన్నో జాతీయ మరియు అంతర్జాతీయ పురస్కారాలు ఆమెను వరించాయి. ఆకాశవాణి ఆడిషన్ బోర్డు సభ్యురాలిగా, కేంద్ర విద్యా సంస్థల మరియు పలు సాంస్కృతిక సంస్థల నిర్వహణలో ఆమె క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు. సంగీతం అనేది ఒక యజ్ఞం అయితే, అందులో లయ అనేది హృదయ స్పందన లాంటిది. ఆ లయ హృదయానికి స్పష్టమైన రూపమిస్తూ, మృదంగ వాదనలో తనకంటూ ఒక ప్రత్యేక శైలిని ఏర్పరచుకుని, మహిళా శక్తికి నిలువునా నిదర్శనంగా నిలిచారు డాక్టర్ మండపాకనాగలక్ష్మి . తన జీవితాన్ని సంగీత అభ్యసనానికి, బోధనకు, సేనకు అంకితం చేసిన ఆమె ప్రస్థానం భావితరాల సంగీత కళాకారులకు ఎప్పటికీ ఒక మహోజ్వల మార్గదర్శకం. ఆమె మృదంగ నాద తరంగాలు తెలుగు నేల కీర్తిని దశదిశలా చాటుతూనే ఉంటాయి.

# ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల వాంఛ తీర్చిన ఘనత కూటమి ప్రభుత్వానిదే : మంత్రి బీసీ జనార్ధన రెడ్డి

## - గజపతినగరం నియోజకవర్గం ప్రధాని సభ ఏర్పాట్లు పరిశీలన : మంత్రి కొండపల్లి శ్రీనివాస్, బీద రవిచంద్ర, దామచర్ల సత్య

**గజపతినగరం, (రాజధాని వార్తలు):** ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల వాంఛ తీర్చిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందని రోడ్లు భవనాల శాఖ మాత్యులు బిసి జనార్ధన రెడ్డి పేర్కొన్నారు. సోమవారం గజపతినగరం తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు ప్రధాని మోడీ పర్యటన ఏర్పాట్లపై జిల్లా మంత్రివర్యులు కొండపల్లి శ్రీనివాస్, పరిశీలకులు బీద రవిచంద్ర, దామచర్ల సత్యలతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో, అత్యాధునిక సదుపాయాలతో, చూడముచ్చటైన హంగులతో నిర్మించబడిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభం కోసం దేశమే కాకుండా ప్రపంచమే ఎదురు చూస్తుందన్నారు. వెనకబడిన ప్రాంతంగా పేరు కలిగిన ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్ని విధాల కృషి చేస్తున్నారటంలో ఎటువంటి సందేహం లేదన్నారు. భోగాపురం ఎయిర్పోర్ట్‌తో పాటు విశాఖలో గూగుల్ వంటి సంస్థ ఏర్పాటుతో పరిశ్రమలు రావడం, యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కలుగుతాయన్నారు. మన ప్రాంతానికి వస్తున్న దేశ ప్రధాని నరేంద్ర మోడీని గౌరవించుకోవడం కోసం ప్రతి ఒక్కరూ ఒక రోజును






త్యాగం చేయాల్సి ఉందన్నారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ నియోజకవర్గానికి తొలిసారిగా వచ్చిన ఆర్ అండ్ బి శాఖ మంత్రి జనార్ధన రెడ్డికి స్వాగతం పలుకుతూ మెంటాడ రోడ్డు నిర్మాణం కోసం మూడున్నర కోట్లు మంజూరు చేసినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గజపతినగరం నుండి 20 వేల మందితో ప్రధానమంత్రి మోడీ సభకు జన సమీకరణ చేసినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంకల్ప బలంతో భోగాపురం ఎయిర్పోర్ట్ నిర్మాణం చేపట్టటం జరిగిందన్నారు. ఎమ్మెల్సీ బీద రవిచంద్ర మాట్లాడుతూ విమానాశ్రయం ప్రారంభించడానికి స్వయంగా దేశ ప్రధాని మన ప్రాంతానికి రావటం గర్వకారణమని కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. దామచర్ల సత్య మాట్లాడుతూ విజయనగరం ప్రాంతంలో తొలిసారిగా లక్షల మందితో జరిగే అల్లూరి సీతారామరాజు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని స్వాగతం పలకాలని పిలుపునిచ్చారు. పొలిట్ బ్యూరో సభ్యురాలు గంట్యాడ శ్రీదేవి మాట్లాడుతూ ఇటీవల కాలంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అనేక ప్రారంభ కార్యక్రమాలను వర్చువల్‌గా చేస్తున్నారని, కానీ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై ఉన్న అభిమానంతో విమానాశ్రయం ప్రారంభించడానికి స్వయంగా రావడం ఈ ప్రాంత ప్రజల అదృష్టం అన్నారు.

చరిత్రలో ఆగస్టు ఒకటి మన ఉత్తరాంధ్ర ప్రాంత చరిత్రలో లిఖించదగిన రోజు అని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ గొంపా కృష్ణ, తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున, బిజెపి నాయకులు రెడ్డి పావని, జనసేన నాయకులు మర్రపు సురేష్, ఏఎంసీ చైర్మన్ పివివి గోపాలరాజు, మాజీ జెడ్పిటిసి మక్కువ శ్రీధర్, క్లస్టర్ ఇంచార్జ్ వైకుంఠం ప్రదీప్ కుమార్, భాజాపా నాయకుడు భాస్కరరావు, నియోజకవర్గ ముఖ్య నాయకులు, నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు, తెలుగుదేశం పార్టీ కార్య కర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# విఎస్‌యూ ఇంజినీరింగ్ కళాశాలలో నాలుగు సెల్ఫ్ ఫైనాన్స్ బీటెక్ కోర్సులకు ప్రభుత్వ ఆమోదం

## - 2026-27 విద్యా సంవత్సరం నుంచి 240 సీట్లతో ప్రవేశాలు : ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** కాకుటూరు గ్రామంలోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్లో 2026-27 విద్యా సంవత్సరం నుంచి నాలుగు బీటెక్ కోర్సులను ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మేరకు ఉన్నత విద్యాశాఖ G.O.Rt.No.153, తేదీ 25-07-2026 ద్వారా ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ ఆమోదం పొందిన కోర్సుల్లో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్సెస్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ ఉన్నాయి. ప్రతి కోర్సుకు 60 చొప్పున మొత్తం 240 సీట్లు మంజూరు చేశారు. ఈ సందర్భంగా విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఆధునిక సాంకేతిక విద్యకు ప్రాధాన్యం ఇస్తూ విశ్వవిద్యాలయ ఇంజినీరింగ్ కళాశాలకు నాలుగు నూతన బీటెక్ కోర్సులకు అనుమతి ఇవ్వడం ఆనందదాయకమని తెలిపారు. భవిష్యత్ పరిశ్రమల అవసరాలను దృష్టిలో ఉంచుకొని రూపొందించిన ఈ కోర్సులు విద్యార్థులకు అత్యుత్తమ ఉపాధి అవకాశాలను కల్పిస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అన్ని రకాల ఆధునిక సౌకర్యాలను విశ్వవిద్యాలయం కల్పిస్తోందని ఆయన తెలిపారు. విద్యార్థులు, విద్యార్థినుల కోసం ప్రత్యేక హాస్టల్ వసతి, ప్రభుత్వ నిబంధనల మేరకు ఫీజు రీయింబర్స్‌మెంట్, బస్సు రవాణా సౌకర్యం, స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు, అత్యాధునిక కంప్యూటర్ సెంటర్, అత్యున్నత ప్రమాణాలతో కూడిన ప్రయోగశాలలు (ల్యాబ్‌లు), విశాలమైన క్రీడా మైదానాలు, అనుభవజ్ఞులైన అధ్యాపక బృందంతో కూడిన ఉత్తమ విద్యా వాతావరణం అందుబాటులో ఉంటుందని వివరించారు. అదనంగా, విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమలతో అనుసంధానమైన శిక్షణ, ఇంటర్న్‌షిప్‌లు, ప్లేస్‌మెంట్ అవకాశాల కల్పనపై విశ్వవిద్యాలయం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ప్రభుత్వ విశ్వవిద్యాలయంలో తక్కువ వ్యయంతో నాణ్యమైన ఇంజినీరింగ్ విద్యను అభ్యసించే అరుదైన అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ అవకాశాన్ని కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి, గౌరవ ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి, ఉన్నత విద్యాశాఖ అధికారులకు ఉపకులపతి కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో విక్రమ సింహపురి యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌ను రాష్ట్రంలోనే అత్యుత్తమ ప్రభుత్వ ఇంజినీరింగ్ విద్యాసంస్థగా తీర్చిదిద్దేందుకు విశ్వవిద్యాలయం కట్టుబడి పనిచేస్తుందని ఆయన పేర్కొన్నారు.



విద్యార్థులకు ముఖ్య గమనిక:
కాలేజ్ పేరు: విక్రమ సింహపురి యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, కాకుటూరు, కాలేజ్ కోడ్: VSUESF, మొత్తం సీట్లు : 240, కోర్సులు: CSE, AI & ML, AI & DS, ECE (ప్రతి కోర్సుకు 60 సీట్లు) పూర్తి వివరాల కోసం విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించండి: www.vsu.ac.in, Mail :vsuce@vsu.ac.in, Mobile No: +919059676703

# జిల్లాలో విజయవంతంగా 'ఎస్ఐఆర్' ప్రక్రియ పూర్తి

## - 85.28 శాతం ఓటర్ల మ్యాపింగ్ పూర్తి చేశాం: జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల - 'సర్' ప్రక్రియ పూర్తి కావడానికి అహర్నిశలు శ్రమించిన జిల్లా అధికారులకు, సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపిన కలెక్టర్





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** జిల్లాలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఎస్ఐఆర్ కార్యక్రమం పురోగతి, గణాంకాలు, తదుపరి చర్యలపై కలెక్టర్ వివరాలు వెల్లడించారు. జూన్ 15 నుంచి జూలై 24 వరకు ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ, డిజిటైజేషన్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించామని తెలిపారు. జిల్లాలోని మొత్తం 19,74,240 మంది ఓటర్లలో 16,83,557 మంది నుంచి ఎన్యూమరేషన్ ఫారాలు సేకరించి 85.28 శాతం మ్యాపింగ్ పూర్తి చేసినట్లు చెప్పారు. మ్యాపింగ్ పూర్తైన వారిలో 83.5 శాతం మందిని 2002 ఓటర్ల జాబితాతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల వివరాల ఆధారంగా అనుసంధానం చేయడం జరిగిందని, ఇది రాష్ట్రంలోనే ఒక విశేషమైన పురోగతిగా పేర్కొన్నారు. మ్యాపింగ్ కాని 1.8 శాతం మంది ఓటర్లకు భారత ఎన్నికల సంఘం నిబంధనల మేరకు నోటీసులు జారీ చేస్తామని తెలిపారు. ప్రభుత్వం గుర్తించిన 12 రకాల అధికారిక గుర్తింపు పత్రాల్లో ఏదైనా ఒకటి సంబంధిత ఈఆర్ఓకు సమర్పిస్తే వారి ఓటు హక్కు కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో 38,645 డూప్లికేట్ ఓట్లు (1.96 శాతం) గుర్తించామని, సంబంధిత ఓటర్ల అంగీకారంతో వాటిని తొలగిస్తామని తెలిపారు. అలాగే 1,13,421 మంది (5.75 శాతం) శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారిగా, 80,699 మంది (4.09 శాతం) మరణించిన వారిగా, 57,077 మంది (2.89 శాతం) అందుబాటులో లేని వారిగా గుర్తించినట్లు వివరించారు. ఉపాధి నిమిత్తం తాత్కాలికంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు తిరిగి వచ్చి అవసరమైన ఆధారాలు సమర్పిస్తే వారి ఓటు హక్కును పునరుద్ధరిస్తామని తెలిపారు. ఈ నెల 31వ తేదీన డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను విడుదల చేస్తామని, అనంతరం దానిని వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచడంతో పాటు గుర్తింపు పొందిన ఎనిమిది రాజకీయ పార్టీలకు ప్రింట్, పెన్‌డ్రైవ్ రూపంలో అందజేస్తామని చెప్పారు. డ్రాఫ్ట్ ప్రచురణ అనంతరం 30 రోజుల పాటు క్లెయిమ్స్, అభ్యంతరాలు స్వీకరిస్తామని, అర్హులైన ఓటర్లు తమ పేర్లు లేకపోయినా లేదా వివరాల్లో లోపాలు ఉన్నా సంబంధిత ఈఆర్ఓ, ఏఈఆర్ఓలను సంప్రదించి సవరించుకోవచ్చన్నారు. "అర్హత ఉన్న ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడం, ఒకరికి ఒకే ఓటు ఉండేలా చూడటమే భారత ఎన్నికల సంఘం లక్ష్యం. సీఈఓ వివేక్ యాదవ్ సూచనలు సలహాల మేరకు జిల్లాలో సర్ ప్రక్రియ విజయవంతంగా పూర్తి చేయగలిగాం. అలాగే గత 45 రోజులుగా సెలవులు కూడా తీసుకోకుండా రాత్రింబవళ్లు కష్టపడి పనిచేసిన సచివాలయ సిబ్బంది, బీఎల్‌వోలు, తాసిల్దార్లు, ఆర్‌డీవోలు, ఎన్నికల ప్రక్రియలో పాల్గొన్న అన్ని శాఖల అధికారులకు నా ప్రత్యేక అభినందనలు," అని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల పేర్కొన్నారు. సర్ ప్రక్రియలో కీలకంగా పనిచేసి విజయవంతం చేసిన జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, డిఆర్ఓ విజయ్ కుమార్‌ను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.

# పిట్లవానిపాలెం మండలంలో నూతనంగా ప్రారంభమైన భారతీయ జనతా పార్టీ కార్యాలయం







**పిట్లవానిపాలెం, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు పివిఎన్.మాధవ్ సోమవారం ఉదయం పిట్టలవానిపాలెం మండల కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయాన్ని అంగరంగ వైభవంగా ప్రారంభించారు. ఈ కార్యక్ర మంలో పిట్టల వానిపాలెం మండల బిజెపి పార్టీ అధ్యక్షుడు అక్కల రామిరెడ్డి, మండల యువమోర్చా అధ్యక్షుడు మన్నెం భాను శివప్రసాద్, సీనియర్ బిజెపి నాయకులు, కార్యకర్తలు వందలాదిగా ప్రజలు ఉత్సా హంగా పాల్గొన్నారు.

# చందోలు ఆలయాలను సందర్శించిన ఏపీ రాష్ట్ర బిజెపి అధ్యక్షులు పి.వి.ఎన్.మాధవ్

## - బగళాముఖి అమ్మవారి ఆలయంలో విశేష పూజలు
## - స్వాగతం పలికిన ధర్మకర్తల మండలి చైర్మన్,ఈఓ





**బాపట్ల, (రాజధాని వార్తలు):** ప్రసిద్ధిగాంచిన శ్రీ బగళాముఖి అమ్మ వారి ఆలయానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బిజెపి అధ్యక్షులు పి.వి.ఎన్. మాధవ్ విచ్చేసి అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిం చుకుని అమ్మవారి సన్నిధిలో ప్రశాంతంగా ధ్యానం చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు ఆలయానికి విచ్చేయగానే ధర్మకర్తల మండలి చైర్మన్ కలకోట చక్రధర్ రెడ్డి స్వాగతం పలు కగా వేద పండితులు పూర్ణకుంభముతో వేదమంత్రముల పూర్వ కంగా ఆలయం ప్రదక్షిణం గావించి తొలుతగా క్షేత్ర పరిపాలకు నికి అర్చనలు జరిపారు.
వారికి దేవస్థానం తరపున వేద ఆశీర్వచనం జరిపించి పట్టు శాలువా అమ్మవారి చిత్రపటంతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ స్థాయిలోనే ఈ ఆలయ ప్రఖ్యాతి చేకూరుతుందని అమ్మవారి వైభవం ఎంతోమంది తనకి తెలియ చెప్పిన మీదట వెంటనే ఆలయానికి విచ్చేశానని ఆలయానికి కావలసిన సౌకర్యాల విషయంలో సంపూర్ణ సహకారం అందిస్తామని తెలియ పరిచారు. తదుపరి శ్రీ లింగోద్భవ స్వామివారి దేవస్థానానికి విచ్చేయగా దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ పరిమి రామకృష్ణ సాయి బాబు స్వాగతం పలికి ఆలయ అర్చకులు దండిభట్ల శ్రీనివాస శాస్త్రి వెంకటసుబ్బయ్యలు అర్చన కార్యక్ర మాలు నిర్వహించి వేద ఆశీర్వచనం జరిపించి తీర్థప్రసాదాలు ఇవ్వడం జరిగిందని దేవస్థానముల ఈవో జి.నరసింహమూర్తి తెలియజేశారు.

# మంత్రి "కొండపల్లి" ఆట విడుపు

## - అమరావతి ఛాంపియన్షిప్ పోటీలను ప్రారంభించిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్ - ఆటలలో పాల్గొనడం ముఖ్యం, గెలుపు ఓటములు సహజం - క్రీడలలో పాల్గొంటే శారీరక వ్యాయామంతో పాటు ఆరోగ్యాన్ని రక్షించుకోవచ్చు - విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కి కృతజ్ఞతలు





**గజపతినగరం, (రాజధాని వార్తలు):** మండలంలోని మరుపల్లి మోడల్ హైస్కూల్ నందు నియోజకవర్గ స్థాయి అమరావతి ఛాంపియన్‌షిప్ పోటీలను సోమవారం రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు ప్రారంభించి, క్రీడాకారులతో కలిసి వాలీబాల్ ఆడారు. ఈ సం దర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులతో కలిసి వాలీబాల్ ఆడుతూ ఉంటే బాల్య జ్ఞాపకాలు గుర్తుకు వచ్చా యని అన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గ్రామీణ స్థాయి నుండి క్రీడాకారులలో ప్రతిభను వెనుక తీయడం కోసం నియో జకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయిలో పోటీలు ఏర్పాటు చేయడంతో పాటు నగదు బహుమతులు ప్రకటించడం జరిగిందన్నారు. అలాగే స్పోర్ట్స్ కోటాను రెండు నుంచి మూడు శాతానికి పెంచిన ఘనత నారా లోకేష్‌కి దక్కుతుందన్నారు. క్రీడల్లో పాల్గొనడం ద్వారా శారీరక వ్యాయామంతో పాటు ఆరోగ్యం కూడా రక్షించుకోవచ్చ న్నారు. విద్యార్థి దశలో క్రీడల్లో ప్రతిభ చాటి సర్టిఫికెట్లు పొంది నట్లయితే ఉద్యోగ సమయాల్లో ఉపయోగపడతాయని తెలిపారు.



ఆటలలో, చదువులో గెలుపు, ఓటములు, ప్రథమ తృతీయ స్థానాలు సాధారణమని, ఓటమితో కృంగిపోకుండా గెలుపు కోసం ప్రయత్నం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పొలిట్ బ్యూరో సభ్యురాలు గంట్యాడ శ్రీదేవి, ఏఎంసీ చైర్మన్ పివివి గోపాలరాజు, మాజీ జడ్పిటిసి మక్కువ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్ రాం సుందర్‌రెడ్డిని అభినందించిన మంత్రులు అచ్చెంన్నాయుడు, కొండపల్లి

## - మన్ కీ బాత్‌లో జిల్లాపై మోదీ ప్రశంసలు గర్వకారణం



**విజయనగరం, (రాజధాని వార్తలు):** జలధార జలహారతి పథకం అమలు తీరుతో విజయనగరం జిల్లాను దేశంలోనే ముందంజలో ఉండేలా చేసిన జిల్లా కలెక్టర్ రాం సుందర్‌రెడ్డిని మంత్రులు కె. అచ్చెంన్నాయుడు, కొండపల్లి శ్రీనివాస్ అభినందించారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఆదివారం నిర్వహించిన మన్ కీ బాత్ కార్యక్రమంలో విజయనగరం జిల్లాను ప్రత్యేకంగా ప్రస్తావించడం జిల్లా వాసులు గర్వించదగ్గ విషయం అని మంత్రులు కొనియా డారు. సోమవారం సాయంత్రం అల్లూరి సీతారామరాజు అంతర్జా తీయ హరిత విమానాశ్రయం సమావేశ మందిరంలో కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డిని శాలువాతో సత్కరించి మొక్కను అంద జేశారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ జలధార జలహారతి కార్యక్రమంలో ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్లి దేశ ప్రధాని మోదీచే కితాబు అందుకోవడం సంతోషకరమన్నారు. విజయనగరం జిల్లాను అన్ని విభాగాల్లో కూడా ప్రథమ స్థానంలో ఉండేలా అధికారులు కృషి చేసేందుకు ఇది ఒక ఆదర్శనీయమైన గుర్తింపు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ పి. ఏ ఆర్.దామోదర్, తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, విశాఖ మెట్రో పాలిటన్ కమిషనర్ తేజ్ భరత్ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన వికాసానికి సరికొత్త బాటలు

## - ఐఐఎంఆర్‌తో సీటీయూఏపీ చారిత్రాత్మక అవగాహన ఒప్పందం

**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** హైదరాబాద్ గిరిజన ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధి, విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి ఊతమిచ్చేలా హైదరాబాద్ వేదికగా ఒక సువర్ణాధ్యాయం ఆరంభమైంది. విద్యా ర్థులకు అత్యుత్తమ శిక్షణ, ఉన్నత ప్రమాణాలతో కూడిన పరిశోధ నల్లో పరస్పర సహకారం లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం (సీటీయూఏపీ-విజయనగరం), ప్రతిష్టాత్మక ఐసీఏఆర్-భారత చిరుధాన్యాల పరిశోధనా సంస్థ (ఐఐఎంఆర్-హైదరాబాద్) చేతులు కలిపాయి. సీటీయూఏపీ ఇన్‌చార్జి ఉప కులపతి ఆచార్య టి.శ్రీనివాసన్, ఐఐఎంఆర్ సంచాలకులు డాక్టర్ తారా సత్యవతి ఈ ప్రతిష్టాత్మక ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసి ఈ నూతన మైత్రీ బంధాన్ని అక్షరబద్ధం చేశారు. ఈ ప్రతిష్టా త్మక కార్యక్రమంలో సీటీయూఏపీ వృక్షశాస్త్ర విభాగాధిపతి, నోడల్ అధికారి డాక్టర్ అనిరుధ్ కుమార్‌తో పాటు పలువురు శాస్త్రవేత్తలు, సీనియర్ అధ్యాపకులు పాల్గొని ఈ బృహత్తర కార్యక్రమానికి సాక్షీభూతులయ్యారు. ఈ చారిత్రాత్మక భాగస్వామ్యం ద్వారా పలు కీలక అంశాలపై దృష్టి సారించనున్నారు:పర్యావరణహితమైన చిరుధాన్యాల సాగును ప్రోత్సహించడం, గిరిజన రైతాంగం స్వావలంబన దిశగా అడుగులు వేసేలా వారిలో అపారమైన సామర్థ్య పెంపు, చిరుధాన్యాలతో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ, మార్కెటింగ్ మెళకువలు,విద్యార్థులకు ఆధునిక సాంకేతి కతపై శిక్షణ, వినూత్న అంశాలపై సంయుక్త పరిశోధనలు తదితర అంశాలపై దృష్టి సారించనున్నారు. ఈ కార్యక్రమం అనంతరం సీటీయూఏపీ ఉన్నత స్థాయి బృందం ఐసీఏఆర్-భారత వరి




పరిశోధనా సంస్థ (ఐఐఆర్ఆర్) సంచాలకులు డాక్టర్ శ్రీనివాస ప్రసాద్ బృందంతో ప్రత్యేకంగా సమావేశమైంది. గత ఏడాది చేపట్టిన ప్రగతిశీల కార్యక్రమాలను సింహావలోకనం చేసు కుంటూ, ఈ ఏటి భవిష్యత్ కార్యచరణకు దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా గిరిజన రైతులకు వ్యవసాయంలో మెరుగైన శిక్షణ అందించడం, అంతరించిపోతున్న దేశీయ వరి వంగడాల పరి రక్షణ, మరియు పరిశోధన-విస్తరణ కార్యక్రమాల బలోపేతంపై ప్రత్యేక దృష్టి సారించాలని తీర్మానించారు. ఆచార్య టి. శ్రీనివాసన్ మాట్లాడుతూ ఈ విద్యా, పరిశోధనాత్మక కలయిక గిరిజన ప్రాం తాల్లో సుస్థిర వ్యవసాయానికి వెన్నెముకగా నిలుస్తుంది. అనాదిగా వస్తున్న వారి అపారమైన సంప్రదాయ విజ్ఞానాన్ని పరిరక్షిస్తూనే, ఆధునిక సాంకేతికతను జోడించి వారి జీవనోపాధి ప్రమాణాలు మెరుగుపడేందుకు ఈ వినూత్న ఒప్పందాలు ఎంతగానో దోహద పడతాయి" అని హర్షం వ్యక్తం చేశారు.

# ఇండియా స్కిల్స్ కాంపిటీషన్ - 2026-27కు యువత భారీ సంఖ్యలో నమోదు చేసుకోవాలి : జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** యువతలో నైపుణ్యాలను పెంపొం దించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచే అవకా శాలను కల్పించేందుకు నిర్వహిస్తున్న ఇండియా స్కిల్స్ కాంపిటీ షన్ - 2026-27లో అర్హత కలిగిన యువత అధిక సంఖ్యలో పాల్గొని నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఐ.ఏ.ఎస్. పిలుపునిచ్చారు. సోమవారం తిక్కన ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ ఇండియా స్కిల్స్ కాంపిటీషన్-2026-27 పోస్టర్‌ను ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నైపుణ్యాభివృద్ధి ద్వారా యువతకు దేశ, విదేశీ స్థాయిలో ఉపాధి అవకాశాలు విస్తృతంగా లభిస్తున్నాయని తెలిపారు. ఈ పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి రాష్ట్ర, ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ స్థాయి లలో తమ ప్రతిభను చాటుకునే అవకాశం లభిస్తుందని పేర్కొ న్నారు. భారత ప్రభుత్వం, నైపుణ్యాభివృద్ధి మరియు వ్యవస్థాపకత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో, జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ, స్కిల్ ఇండియా, వరల్డ్ స్కిల్స్ ఇండియా భాగస్వామ్యంతో ఈ పోటీలు నిర్వహించబడుతున్నాయని తెలిపారు. ఈ పోటీలు యువతలో సాంకేతిక నైపుణ్యాలు, సృజనాత్మకత, నవీన ఆలోచ నలు, సమస్యల పరిష్కార సామర్థ్యాలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ఈ పోటీల్లో మొత్తం 63 నైపుణ్య విభాగాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సైబర్ సెక్యూరిటీ, ఇండస్ట్రీ 4.0, మెకాట్రానిక్స్, రోబోట్ సిస్టమ్స్ ఇం టిగ్రేషన్, క్లౌడ్ కంప్యూటింగ్, ఆటోమొబైల్ టెక్నాలజీ, ఎలక్ట్రికల్ ఇన్‌స్టాలేషన్, వెల్డింగ్, వెబ్ టెక్నాలజీస్, మొబైల్ అప్లికేషన్ డెవలప్‌మెంట్, ఫ్యాషన్ టెక్నాలజీ, బ్యూటీ థెరపీ, హెవీ వెహికల్ టెక్నాలజీ, ప్లంబింగ్, రిన్యూవబుల్ ఎనర్జీ, సాఫ్ట్‌వేర్ టెస్టింగ్ తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించబడతాయని వివరించారు.
వయోపరిమితి: 01 జనవరి 2003 లేదా ఆ తరువాత జన్మించిన



వారు కొన్ని ఎంపిక చేసిన టీమ్ మరియు వ్యక్తిగత నైపుణ్య విభాగాలకు అర్హులు. 01 జనవరి 2006 లేదా ఆ తరువాత జన్మించిన వారు మిగతా వ్యక్తిగత నైపుణ్య విభాగాలకు అర్హులు.
పోటీల నిర్వహణ దశలు:
జిల్లా ? రాష్ట్ర ? ప్రాంతీయ ? జాతీయ ? అంతర్జాతీయ (వరల్డ్ స్కిల్స్) స్థాయిలలో పోటీలు నిర్వహించబడతాయి. జాతీయ స్థాయిలో విజేతలుగా నిలిచిన అభ్యర్థులు భారతదేశానికి ప్రాతిని ధ్యం వహిస్తూ అంతర్జాతీయ వరల్డ్ స్కిల్స్ పోటీలలో పాల్గొనే అవకాశం పొందుతారు. అర్హత కలిగిన యువత SIDH పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ అవకాశాన్ని ప్రతి యువకుడు, యువతి సద్వినియోగం చేసు కొని తమ నైపుణ్యాలను ప్రపంచ వేదికపై ప్రదర్శించాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటే శ్వర్లు, డిఆర్వో విజయ కుమార్, జిల్లా ఉపాధి కల్పన అధికారి వినయ్ కుమార్, సెట్నెల్ సిఈవో నాగేశ్వరరావు, జిల్లా నైపుణ్యా భివృద్ధి శాఖ అధికారి అబ్దుల్ ఖయ్యూం, సంబంధిత విభాగాల అధికారులు పాల్గొన్నారు.

RAJADHANI CLASSIFIEDS Ad. Call
9440662699, rajadhanivartalu.com

EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ అఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యం.ఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ బి.రమేష్, మంగళగిరి 0863-999999

RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎక్ట్రానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిన్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి ప్రాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# అమరావతిపై ఎందుకింత ద్వేషం?

మాట తప్పను.. మడమ తిప్పను అంటూ డైలాగులు చెప్పే మాజీ ముఖ్య మంత్రి జగన్ మోహన్ రెడ్డి అమరావతి రాజధాని విషయంలో మాట తప్పడం, మడమ తిప్పడంలో పేటెంట్ హక్కులు పొందారు. 2014లో ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో రాజకీయ ప్రయోజనాల కోసం అమరావతికి జై కొట్టిన జగన్ 2019లో అధికారంలోకి రాగానే దోచుకునే అవసరం కోసం మాట మార్చేశారు. మూడురాజధాను లంటూ కొత్త నాటకానికి తెరతీశారు. 2024లో ప్రజలు వైసీపీ ని తిరస్కరించిన తర్వాత "మావిగన్" అంటూ మళ్ళీ తెర మీదకు వచ్చారు. మావిగన్ అంటే జగన్ భాషలో చెప్పాలంటే మాట తప్పడం.. విద్వేషాలు.. గన్ సంస్కృతి. అందుకే ఆయన మావిగన్ రాగాన్ని ఆలపిస్తున్నారు. జగన్ లక్ష్యం రాజధాని నిర్మించటం కాదు. రాజధాని పేరిట ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టడం, ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టడమని ప్రజలకూ బాగా అర్థమైంది.కాని మాజీ ముఖ్యమంత్రికి మాత్రం జ్ఞానోదయం కలగడం లేదు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమరావతి రాజధాని నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఐదేళ్ళ వైసీపీ పాలనలో విధ్వంసానికి గురైన అమరావతికి కూటమి ప్రభుత్వ పాలనలో మళ్ళీ వెలుగులు వచ్చాయి. ఇది సహించలేని జగన్ విద్వేషం కనపరుస్తూనే ఉండడాన్ని ప్రజలు గమనిస్తున్నారు. అధికారంలో ఉన్న ఐదేళ్ళు అమరావతిని సర్వనాశనం చేయడమే లక్ష్యంగా కుట్రలు చేసిన జగన్ ఇప్పటికీ రాజధానిపై విషం కక్కడం మానలేదు. అవాకులు చవాకులతో మరోసారి రాష్ట్ర ప్రజల్ని తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తూనే ఉన్నారు.

**ఊసరవెల్లి కూడా సిగ్గు పడుతుందేమో ?**

అమరావతిపై నాలుక మడతేయడం, మాటమార్చేయడం జగన్ కు వెన్నతో పెట్టిన విద్య. గుంటూరు-విజయవాడ మధ్య 35 వేల ఎకరాల్లో రాజధాని నిర్మించాలని,రాజధానిగా అమరావతి



తమకు ఆమోదయోగ్యమేనని ప్రతిపక్ష నేత హోదాలో అసెంబ్లీ సాక్షిగా చెప్పిన జగన్ 2019 వరకు అదేపాట పాడారు. రాష్ట్ర రాజధానిగా అమరావతినే కొనసాగిస్తామని 2019 ఎన్నికల సభయంలోనూ జగన్, వైకాపా నాయకులు ఢంకాభజాయించి చెప్పారు. అసెంబ్లీ, సచివాలయం, హైకోర్టు ఎక్కడ ఉంటే అదే రాజధాని అని జగన్ ఒక సభలో చెప్పారు. 2019లో ఓట్ల కోసం నటించిన జగన్ గెలిచాక అసలు రూపం బయటపెట్టారు. మూడు రాజధానుల పేరుతో అమరావతిని సర్వనాశనం చేసేందుకు నడుం కట్టారు. 2024 ఎన్నికల్లో తల బొప్పి కట్టడంతో వైకాపా మళ్ళీ అధికారంలోకి వస్తే సీఎంగా జగన్ అమరావతిలోనే ఉంటారని విశాఖ వెళ్ళరని ఆపార్టీ నాయకులు చెప్పారు. వైకాపా నాయకుల నిజస్వరూపమేంటో, అమరావతిపై వారి వైఖరేంటో జగన్ చేస్తున్న వ్యాఖ్యలతో తేటతెల్లమైంది. అమరావతిపైజగన్ తరుచుగా మాటలు మార్చడాన్ని చూస్తే ఊసరవెల్లి కూడా సిగ్గుపడుతుంది.

**ప్రమాదకర రాజకీయ క్రీడ ..!!**

అమరావతి నిర్మాణం వేగం అందుకున్న శుభతరుణంలో వాస్తవాలను వక్రీకరిస్తూ, స్వార్ధబుద్ధితో, సంకుచిత వాదనలతో ప్రమాదకర రాజకీయ క్రీడను ఆరంభించాడు జగన్ రెడ్డి. ఆయన పసలేని పనికిమాలిన రాజకీయాన్ని ప్రజలు అర్థం చేసుకోవాలి. మొదటి నుంచీ అమరావతికి పురిట్లోనే సంధి కొట్టాలని జగన్ రెడ్డి సృష్టించిన అడ్డంకులు అన్నీ ఇన్నీ కావు. అమరావతిని పడగొట్టడం, విడగొట్టడం, చెడగొట్టడమే లక్ష్యంగా గోముఖ వ్యాఘ్ర విన్యాసాన్ని జగన్ ప్రదర్శించాడు. అమరావతిలో అద్భుత రాజధానిని నిర్మిస్తామన్న హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక అమరావతికి మరణ శాసనం రాశాడు. మూడు రాజధానుల నాటకం ఆడి రాష్ట్రానికి రాజధానే లేకుండా చేశాడు. నాలుకను అడ్డదిడ్డంగా మడతేయడంలో జగన్ రెడ్డి ఊసరవెల్లికి సాటి రాగలడు. అనాగరిక విద్వేష రాజకీయాలతో ప్రాంతాల మధ్య వైషమ్యాలు ఎగదోసి కండ కావరంతో రాజధాని అమరావతిని నిర్వీర్యం చేశాడు. అందుకే జగన్‌రెడ్డిని 2024 ఎన్నికల్లో ప్రజలు చిత్తు చిత్తుగా ఓడించారు. ప్రతిపక్ష హోదా సైతం దక్కనంతగా తిరస్కరించారు. అయినా ఆయన బుద్ధి మార్చుకోవడం లేదు. అమరావతిపై వికృత వ్యాఖ్యలు చేస్తూ సైంధవుడిలా ఇంకా అడ్డుకోవాలని చూస్తున్నాడు. రాజధానిగా అమరావతి అభివృద్ధి కాకూడదన్నదే జగన్ రెడ్డి ఉద్దేశ్యంగా అర్థమవుతున్నది. ఆంధ్రప్రదేశ్‌కి ఎటువంటి పెట్టుబడులు, లేదా గ్రాంట్లు రాకూడదు అన్నట్లుగా ఉంది ఆయన వ్యవహారం. నాటి తెలుగుదేశం ప్రభుత్వం పైసా ఖర్చు లేకుండా రైతులను మెప్పించి, ఒప్పించి ముప్పయ్ వేల ఎకరాల పైచిలుకు భూములను సమీకరించి రాజధాని నిర్మాణం ప్రారంభించింది. ఫ్లడ్ లైట్ల వెలుగులో వేలమంది కార్మికులతో రాజధాని నిర్మాణ పనులు జరిగాయి. అడ్డు పడకుండా అనుకున్నట్టుగా జరిగి ఉంటే ఈపాటికి అమరావతి నిర్మాణం పూర్తయి ఉండేది. నేటికి ఆంధ్రప్రదేశ్‌కు అమరావతి ఒక ప్రధాన ఆర్థిక వనరుగా ఉండేది. కానీ 2019లో విధి వక్రించి రాష్ట్రంలో తుగ్లక్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అమరావతిని రాజధానిగా నిర్ణయిస్తూ శాసనసభలో తీర్మానం చేసినప్పుడు ఆమోదం తెలిపిన తుగ్లక్ ముఖ్యమంత్రి, ఆ తర్వాత మాట మార్చి, మూడు రాజధానులు అంటూ మూడు ముక్కలాటకు తెర తీశారు. ఆ వెంటనే ఆయన ముష్కర మూక కూడా అమరావతిపై విషపూరితమైన ప్రకటనలు చేయడం ఆరంభించింది. వాళ్ళు అమరావతిని ఎడారిగా, శ్మశానంగా అభివర్ణించారు. సొంత మీడియా సహకారంతో అమరావతిని భ్రమరావతిగా, కమ్మరావతిగా చిత్రించారు. రాజధాని భూముల వ్యవహారంలో భారీ కుంభకోణం జరిగిందని ప్రచారం చేసారు. ఆ తర్వాత హైకోర్టు నుంచి సుప్రీం కోర్టు వరకు అన్ని స్థాయిల్లో ఈ కేసులను కొట్టివేశారు. అంతేగాక అమరావతిలో కుంభకోణం, లంబకోణం ఏదీ జరగలేదని విస్పష్ట తీర్పు వెలువడింది. అయినప్పటికీ జగన్ ముష్కర మూక విష ప్రచారాన్ని ఆపలేదు. చంద్రబాబు ప్రారంభించిన రాజధాని కావడంతో వ్యక్తిగత ద్వేషం, రాజకీయ అహంకారం, ప్రతీకార భావజాలం ఈ మూడింటి మేళవింపుతో అమరావతిపై విషం కక్కారు. ప్రపంచంలో ఎక్కడా లేని మూడు రాజధానులు అనే కాన్సెప్ట్ తెచ్చేసరికి పెట్టుబడులు పారిపోయాయి, ఉద్యోగాలు ఆగిపోయాయి, రైతులు రోడ్డెక్కారు. రైతులపై వ్యవస్థాగత దాడి మొదలైంది. రోడ్లు, భవనాలు, కార్యాలయాల ధ్వంసం, కేసులు, అరెస్టులు, అణచివేత, అమరావతిపై జగన్ కక్కిన విషం ఏపీ విశ్వసనీయతను కూడా తీవ్రంగా దెబ్బతీసింది. ఏది ఏమైనా అమరావతి అంతమే జగన్ పంతమని అర్థమవుతున్నది. అందుకే జగన్ కుట్రల నుంచి అమరావతిని రక్షించుకోవాలి.

**వాసంశెట్టి సుభాష్**
కార్మికశాఖ మంత్రి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

# 31న రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టులు డిమాండ్స్ డే

**విజయవాడ, (రాజధాని వార్తలు):** అపరిష్కృతంగా ఉన్న జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోరుతూ జూలై 31న రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టులు డిమాండ్స్ డే పాటించాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్, ఆంధ్రప్రదేశ్ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్టు అసోసియేషన్లు సంయుక్తంగా పిలుపునిచ్చాయి. మార్చి 4న విజయవాడలో జరిగిన జర్నలిస్టు ర్యాలీని ఉద్దేశించి ప్రసంగించిన సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారధి ఇచ్చిన హామీల నేపథ్యంలో కొన్ని సమస్యలు పరిష్కారమైనప్పటికీ ప్రధానమైన సమస్యలు ఇంకా పెండింగ్లోనే ఉన్నాయి.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య, సీనియర్ జర్నలిస్టులకు పెన్షన్, జర్నలిస్టులకు కార్మిక భీమా సదుపాయం, వర్కింగ్ జర్నలిస్ట్ సంక్షేమ నిధి ఏర్పాటు, జర్నలిస్టుల సంక్షేమ నిధి కమిటీ, జర్నలిస్టులపై దాడుల నివార ణకు హైపవర్ కమిటీతోపాటు జిల్లా స్థాయి కమిటీల ఏర్పాటు, సి ఆర్ మీడియా అకాడమీ గవర్నింగ్ కౌన్సిల్ ఏర్పాటు, కొత్త జిల్లాలు ఏర్పడిన నేపథ్యంలో తదనుగుణంగా జిల్లాల్లో సమాచార శాఖను బలోపేతం చేసి జర్నలిస్టులకు అవసరమైన సదుపాయాల కల్పన, జర్నలిస్టుల స్థితిగతుల అధ్యయనం కోసం మీడియా కమిషన్ ఏర్పాటు, ప్రభుత్వ సారధ్యంలో నడుస్తున్న ఆంధ్రప్రదేశ్ మాసపత్రిక పునరుద్ధరణ, వృద్ధాప్యంలోని జర్నలిస్టులకు వృద్ధాశ్ర మ నిర్మాణం తదితర సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గ కేంద్రాలలో, జిల్లా కేంద్రాలలో జర్నలిస్టుల డిమాండ్స్ డే నిర్వహించేందుకు సంసిద్ధం కావాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా శాఖలకు పిలుపు ఇచ్చింది. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు రాష్ట్రంలోని ప్రింట్, బ్రాడ్ కాస్ట్ మీడియాలో పనిచేస్తున్న జర్నలిస్టులందరూ కలిసి రావాలని ఎస్ వెంకట్రావు, జి ఆంజనేయులు ఏపీడబ్ల్యూజేఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి కోరారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan